ఉష్ణోగ్రత గురువారం గరిష్టం : 30.0 కనిష్టం : 22.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు

శుక్రవారం 24 అక్టోబరు 2025


సత్యసాయి సన్నిధిలో సాంస్కృతిక ప్రదర్శన

అలరించిన సోమనాథ్ మహాదేవ్

పుట్టపర్తి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన బాలవికాస్ చిన్నారులు 'సోమనాథ్ మహాదేవ్' పేరిట ప్రదర్శించిన నృత్యం మైమరపింపజేసింది. స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో గుజరాత్ భక్తులు మూడోరోజు గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగించారు. మొదట దీపక్ కన్ సారా బృందం సంగీత కచేరి నిర్వహించారు. గంటపాటు మధుర గానంతో అలరించారు. అనంతరం సూరత్ బాలవికాస్ చిన్నారులు సంగీత నృత్యాన్ని ప్రదర్శించారు.

ఉచిత బస్సు ఆరోగ్యమస్తు..!

- పెద్దాస్పత్రికి పెరిగిన ఓపీ
- సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న వైనం
- శుభపరిణామం అంటున్న వైద్యవర్గాలు

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నెలవారీగా ఓపీ వివరాలు...

నెల	మొత్తం ఓపీ	మహిళా ఓపీ	శాతం
ఏప్రిల్	52,545	20,492	39
మే	49,575	20,325	41
జూన్	58,672	22,291	37
జూలై	61,965	25,045	40
ఆగస్టు	67,742	31,885	47
సెప్టెంబరు	74,967	38,982	52

ఫ్రీ బస్సు ఎఫెక్ట్.. ఆరోగ్యంపై మహిళల శ్రద్ధ

పల్లెటూరి మహిళలు ఆరోగ్యం గురించి పట్టించుకునే పరిస్థితులు తక్కువ. ఇబ్బందిగా ఉన్నా.. ఆర్థిక పరిస్థితులు, ఇతరత్రా కారణాలతో నగరాలు, పట్టణాలకు వెళ్లి వైద్యం చేయించుకోలేకపోతుంటారు. జబ్బు ముదిరాక ఆస్పత్రులకు పరుగులు పెట్టినా.. డబ్బు వృథా తప్ప.. ప్రయోజనం ఉండకపోవచ్చు. జబ్బు ప్రారంభదశలోనే పరీక్షలు చేయించుకుని, చికిత్స తీసుకుంటే నయమయ్యే అవకాశం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన స్త్రీ శక్తి పథకం వారికి వరంగా మారింది. ఉచిత బస్సు ప్రయాణంతో చాలామంది మహిళలు ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే నగరాలు, పట్టణాలకు వెళ్తున్నారు. సొంత ఖర్చులు పెట్టుకుంటే చాలు. వారిపై రవాణా భారం తగ్గుతోంది. దీంతో పెద్దాస్పత్రులకు అధిక సంఖ్యలో వచ్చి, పరీక్షలు చేయించుకుని, వైద్యం పొందుతున్నారు. స్త్రీ శక్తి ప్రవేశ పెట్టాక జిల్లా సర్వజనాస్పత్రికి మహిళా ఓపీ విపరీతంగా పెరగడమే ఇందుకు నిదర్శనం.



అనంతపురం వైద్యం, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళలకు ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు ప్రయాణం పథకం.. వారి స్వీయ ఆరోగ్యంపై శ్రద్ధ వహించేలా దోహదపడుతోంది. ఊర్లో బస్సు ఎక్కి అనంతపురంలో దిగి పెద్దాస్పత్రికి వస్తున్నారు. సొంత ఖర్చులు మినహా చార్జీల భారంలేదు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పెద్ద డాక్టర్లు ఉంటారనీ, అక్కడికెళ్లి డాక్టర్‌తో చూపించుకుంటే అన్నిరకాల పరీక్షలు చేస్తారు, ఎలాంటి ఆరోగ్య సమస్య ఉన్నా.. ప్రారంభ దశలోనే చూపించుకుంటే వాటి నుంచి బయటపడవచ్చని మహిళలు భావిస్తున్నారు. ఆ మేరకు వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు. ఇలా.. ఉచిత బస్సు పథకాన్ని ఆరోగ్య పరిక్షరణకు మహిళలు వినియోగిస్తుండడం హర్షణీయం.

సుదూర ప్రాంతాల నుంచి...

ఉచిత బస్సు ప్రయాణం అమలు కావడంతో ఉమ్మడి జిల్లాలోని సుదూర ప్రాంతాలనుంచి మహిళలు పెద్దాస్పత్రికి తరలివస్తున్నారు. కుటుంబ సభ్యుల ఆసరా లేకుండా వైద్యసేవలు పొందేందుకు మహిళలే సొంతంగా ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వస్తుండటం విశేషం. ఇంటి అవసరాల కోసం తప్పని పరిస్థితుల్లో కుటుంబంలోని పురుషులే అనంతపురం వచ్చేవారు. జిల్లా సరిహద్దు ప్రాంతాలైన రాయదుర్గం, కణేకల్లు, గుంతకల్లు, తాడిపత్రి, కదిరి, అమరాపురం ఇలా అన్ని మండలాల నుంచి మహిళలు వారి ఆరోగ్యం కోసం ఆస్పత్రికి వస్తుండటం శుభపరిణామమని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. కర్నూలు, కడప జిల్లాల్లోని (మిగతా 6లో...)


కంటి చికిత్స విభాగంలో మహిళలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు




తొలిసారి వచ్చా

ఉచిత బస్సు పథకం అమలు తరువాత తొలిసారి పెద్దాస్పత్రికి వచ్చా. అనంతపురం రావాలంటే రూ.200 చార్జీనే అవుతుంది. దీంతో ఖర్చులు భరించలేక అనారోగ్యంగా ఉంటే కొత్తచెరువు, ధర్మవరంలోనే చూపించుకునేవారం. పెద్దాస్పత్రిలో అయితే అన్నిరకాలుగా పరీక్షలుచేసి మందులు ఇస్తారు. చార్జీలేదు కాబట్టి, ప్రస్తుతం ఉచిత బస్సులో అనంతపురం వచ్చా. అనవసరంగా ఎక్కి దిగకుండా ఇలాంటి అవసరాలకు ఫ్రీబస్సు ఉపయోగపడుతుంది.

-నాగమ్మ, కొడపగానిపల్లి, కొత్తచెరువు మండలం

తెరుచుకున్న సీజీపీ గేట్లు


గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు


ప్రాజెక్టులో గంగపూజ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

తనకల్లు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ముండ్లవారిపల్లి సమీపాన గల చెన్నరాయస్వామి గుడి ప్రాజెక్టు (సీజీపీ) పూర్తిగా నిండిపోయింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 27 అడుగులు, నిల్వ సామర్థ్యం 170 ఎంసీఎఫ్ (మిలియన్ క్యూబిక్ అడుగులు). ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గురువారం ప్రాజెక్టు గేట్లు ఎత్తి, నీటిని పాపాఘ్ని నదికి వదిలారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో వరుణుడు కరుణించడంతో సీజీ ప్రాజెక్టు పూర్తిగా నిండిందన్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా చెక్కవారిపల్లి, తనకల్లు, బొంతలపల్లి, తవళం, పెద్దఎద్దులవారిపల్లి చెరువులను నింపామన్నారు. రైతులు రబీలో పంటలు సాగు చేసి, లబ్ధి పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీజీ ప్రాజెక్టు చైర్మన్ రామ్మోహన్, పార్టీ కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, తోటపల్లి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బాగేపల్లి చలపతి, మాజీ జడ్పీటీసీ రవీంద్రారెడ్డి, తెలుగు యువత మండలాధ్యక్షుడు కావడి ప్రవీణ్‌కుమార్, డీఈ గంగాధర్, జేఈ బయప్ప పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం ఏదీ..?

- సాగుకు పొలాలు సిద్ధం చేసిన రైతులు
- సబ్సిడీ విత్తనం కోసం ఎదురుచూపులు


ప్రత్యామ్నాయ పంట సాగుకు సిద్ధంగా ఉన్న భూమి

ఓబుళదేవరచెరువు, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ పంటల సాగుకు సబ్సిడీ విత్తనం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌ను తీవ్ర వర్షాభావం వెంటాడటంతో చాలా మంది రైతులు పంటలు సాగు చేయలేదు. సాగు చేసినవారు తీవ్రంగా నష్టపోయారు. దీంతో కనీసం రబీ సీజన్‌లోనైనా ఉలవ, పెసర, అలసంద వంటి ప్రత్యామ్నా పంటలు సాగు చేసి నష్టాల నుంచి గట్టెక్కుదామనే ఆలోచనలో అనేకమంది రైతులు ఉన్నారు. అయితే రబీ సీజన్ ప్రారంభమయ్యి దాదాపు నెల రోజుల కావస్తున్నా ప్రత్యామ్నాయ విత్తన పంపిణీపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో సాగుకు పొలాలు సిద్ధం చేసుకున్న రైతులంతా ఉసూరుమంటున్నారు. ప్రస్తుతం పంటల సాగుకు అనువైన వాతావరణం ఉందని, ప్రభుత్వం త్వరగా సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తే పంటలు సాగు చేసుకుంటామని వారు చెబుతున్నారు.

సేద్యం చేశాం: రామచంద్ర, రామిరెడ్డిపల్లి



నాకు మూడు ఎకరాల పొలం ఉంది. అందులో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేద్దామని, సేద్యం చేయించా. ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తే పంట సాగు చేస్తా. వానలు సకాలంలో రాకపోవడంతో వేరుశనగను కొద్దిగా సాగు చేసి నష్టపోయా. ప్రభుత్వం త్వరగా ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేస్తే మాలాంటి రైతులకు బాగుంటుంది.

త్వరగా పంపిణీ చేయాలి



గత నాలుగేళ్లుగా ప్రత్యామ్నాయ విత్తనాలు ప్రభుత్వం పంపిణీ చేయలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేస్తే సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. నాకు ఉన్న ఐదు ఎకరాలలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు పొలాన్ని సిద్ధం చేశా. ప్రభుత్వం త్వరగా విత్తన పంపిణీ చేపట్టాలి.

-ఇడగొట్టు రమణమ్మ, గాజుకుంటపల్లి

కొత్త ఎత్తులు

పింఛన్ల కోసం దొడ్డిదారిలో సర్టిఫికెట్లు

- భారీగా పెరిగిన దరఖాస్తులు
- తాత్కాలికంగా నిలిపివేసిన ప్రభుత్వం
- క్షేత్రస్థాయిలో పరిశీలన తర్వాతే మంజూరు?
- రెండు, మూడేళ్లుగా అర్హుల ఎదురుచూపు


పింఛన్లు మంజూరు చేయాలంటూ ఎమ్మెల్యే సింధూరా రెడ్డికి వినతులు ఇస్తున్న మహిళలు (ఫైల్)

కొత్తచెరువు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కొత్త పింఛన్ల కోసం కొందరు దొడ్డిదారిలో సర్టిఫికెట్లు పొందుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పింఛన్ సొమ్ము భారీగా పెరగడంతో దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. దీంతో ప్రభుత్వం కొత్త పింఛన్ల మంజూరును తాత్కాలికంగా నిలిపివేసింది. ఈక్రమంలో అర్హులైనవారు కూడా పింఛన్ కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల పింఛన్ల కోసం 8,325 మంది దరఖాస్తు చేసినట్లు డీఆర్‌డీఏ అధికారులు చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో అర్హుల్లో ఆందోళన నెలకొంది. గత ప్రభుత్వం పెద్ద ఎత్తున అనర్హులకు పింఛన్లు ఇవ్వడంతోనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు చెబుతున్నారు. ఈనేపథ్యంలో కొత్త పింఛన్ల మంజూరుకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరుగుతోంది. ముందుగా అనారోగ్యంతో మంచం పట్టిన పింఛన్‌దారులలో అర్హులెవరు అనే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం స్పౌజ్ ఆప్షన్ కింద పింఛన్లను మంజూరు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పింఛన్ ఇచ్చి ఆదుకోవాలి



నా భర్త చనిపోయి మూడేళ్లయింది. నాకు ఇల్లు, భూమి లేవు. అద్దె ఇంటిలో ఉంటున్నా. కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని, ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నా. పనులు లేనప్పుడు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నాకు ఎలాంటి ఆధారం లేదు. వితంతు పింఛన్ అన్నా వస్తే కొంత ఆసరాగా ఉండేది. ప్రభుత్వం వితంతు పింఛన్ మంజూరుచేసి ఆదుకోవాలి.

- భారతి, లింగారెడ్డి పల్లి

భర్తకు వచ్చే పింఛన్‌తో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. నాకు వికలాంగ సర్టిఫికెట్ కూడా ఉంది. పింఛన్ మంజూరు చేయాలని రెండేళ్ల నుంచి కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా నా ఇబ్బంది ఎవరూ పట్టించుకోలేదు.

-గంగినేపల్లి నాగరత్నమ్మ, కొత్తచెరువు

గత ప్రభుత్వంలోనే దరఖాస్తు చేశా



నా వయసు 65 ఏళ్లు. అయినా వృద్ధాప్య పింఛన్ రాలేదు. గత ప్రభుత్వంలోనే పింఛన్ కోసం సచివాలయంలో దరఖాస్తు చేశా. అయినా ఫలితం లేదు. జిరాక్సు కోసం వెళ్లేటప్పుడు ఆధార్‌కార్డు, బియ్యంకార్డు ఉన్న బ్యాగు ఎక్కడో పడిపోయింది. దీంతో మళ్లా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఆధార్, బియ్యం కార్డులు లేవు. దీంతో ఇబ్బంది పడుతున్నా. పొట్టకూటి కోసం సంఘమేశ్వర శివాలయంలో పనిచేస్తున్నా.

-కేశప్ప, సిద్ధరాంపురం

మైగ్రేషన్ ఆప్షన్ కింద తొలగింపు

వైసీపీ పాలనలో టీడీపీ సానుభూతిపరులు, కార్యకర్తల కుటుంబ సభ్యుల పింఛన్లను కొత్త కొత్త ఎత్తుగడలతో తొలగించారు. మమూడు నెలలు వరుసగా పింఛను తీసుకోకపోతే రద్దు అయ్యేలా నిబంధన అమలు చేశారు. ఈ సాకుతో వందలాది పింఛన్లను తొలగించారు. లబ్ధిదారులకు నివాసం ఉన్న గ్రామాల్లో పింఛన్ నగదును ఇవ్వాల్సి ఉంది. మైగ్రేషన్ ఆప్షన్ ఎత్తుగడతో లబ్ధిదారులకు తెలియకుండా వేర్వేరు గ్రామాలకు పింఛన్ నగదును బదిలీ అయ్యేలా చేస్తూ 3 నెలల కాలం గడిపి రద్దు చేశారని అప్పట్లోనే టీడీపీ సానుభూతిపరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారంతా ఇప్పుడు కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో అర్హత ఉండి కూడా లబ్ధి పొందలేకపోతున్నారు. పింఛన్ తీసుకుంటూ భర్త చనిపోతే వెంటనే భార్యకు పింఛన్ ఇచ్చేలా గత ఏడాది కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుని, అమలు చేస్తోంది.

చేయి పోయింది..



గడ్డి కోత యంత్రంలో పడి చేయి పోయింది. దీంతో ఉపాధిని కోల్పోయా. కుటుంబ పోషణ భారంగా మారింది. నా భర్త కిడ్నీలు దెబ్బతినడంతో ఆరోగ్యం మందగించింది. దీంతో ఇంటివద్దనే ఉన్నాడు. నా

మార్గదర్శకాలు రావాలి

కొత్త పింఛన్లకు దరఖాస్తులు తీసుకునేందుకు ప్రభుత్వం నుంచి ఇంకా మార్గదర్శకాలు రాలేదు. ప్రస్తుతం స్పౌజ్ కింద మాత్రమే పింఛన్లు మంజూరు అవుతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం అనారోగ్యంతో మంచం పట్టినవారు, దివ్యాంగుల్లో అనర్హులు ఎవరైనా ఉన్నారా...?అని పరిశీలిన చేయిస్తోంది. క్షేత్రస్థాయిలో పింఛన్ల పరిశీలనకు వెళ్లే అధికా రులు, సిబ్బందిని కొత్త పింఛన్లు ఇప్పించాలని చాలామంది అడుగుతు న్నారు. ప్రజా స్పందన ద్వారా దరఖాస్తులు వస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే కొత్త పింఛన్లను మంజూరు చేస్తాం.

- నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

విద్యాశాఖలో వలంటీర్లు..!

నియామకం దిశగా అడుగులు 6
టీచర్ల సర్దుబాటుకు విముఖత
రాష్ట్రశాఖ ప్రతిపాదనలు.. విద్యాశాఖ జాబితా సిద్ధం

దొంగల సవాల్..!

- ఒక కేసు ఛేదించకముందే మరో నేరం 6
- వరుస దొంగతనాలతో ప్రజల బెంబేలు
- నామమాత్రంగా పోలీసుల గస్తీ

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- పంచాయతీరాజ్ ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు 7

ప్రకృతి సేద్యంపై అవగాహన పెంచండి

పీఎండీడీకేవైని పటిష్టంగా అమలు చేయండి
అధికారులకు కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశం

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భూమాత రక్షణ, ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజనను జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు సూచనలు చేశారు. ప్రకృతి సేద్యం విభాగాన్ని కూడా కమిటీలో చేర్చి, ప్రకృతి సేద్యం పద్ధతులను రైతులకు వివరించేందుకు ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయి కమిటీలను వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని, సమావేశాలను నిర్వహించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని వంద గ్రామాలలో ఎక్కడ రసాయనిక ఎరువుల వినియోగం అధికంగా ఉందో గుర్తించి, నియంత్రించాలని ఆదేశించారు. జిల్లా పరిషత్, జిల్లా సహకార సంఘాలు, పోలీసు శాఖ అధికారులు సమన్వయం చేసుకుని, కార్యాచరణను అమలుపరచాలని సూచించారు. రాష్ట్ర సరిహద్దులలో నిఘా పెంచాలని, ఎరువుల అక్రమ రవాణా జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఎం డీడీకేవైని గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అమలు చేసేలా వచ్చే ఐదేళ్లకు ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. పంటలవారిగా ఎరువుల మోతాదును నిర్ణయించి, రైతులు ఆచరించేలా చూడాలని వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తను ఆదేశించారు. డివిజన్, గ్రామస్థాయిలో వీలైనంత త్వరగా సమావేశాలు ఏర్పాటు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి వి.రామునాయక్ అన్నారు. సమావేశంలో డీసీఓ కృష్ణా నాయక్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు, సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అయ్యో.. గోపాల..!

- 25 ఏళ్లుగా గోపాలమిత్రలకు పెరగని వేతనం
- ఏ నెలా సక్రమంగా అందని పరిస్థితి
- పశుసంవర్ధక సహాయకులు చేసే పని చేసినా ప్రయోజనం ఏదీ



అనంతపురం అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉద్యోగంలో చేరి 25 ఏళ్లు గడిచినా పైసా పెంపులేని జీతంతో పని చేస్తున్నామని గోపాలమిత్రలు వాపోతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ సమస్యలు వినే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2000 సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు వైద్య సేవలు అందించేందుకు పదో తరగతి విద్యార్హతతో గోపాలమిత్రలను నియమించారు. అప్పట్లో రూ.6500 లు వేతనం ఇచ్చేవారు. ఇప్పటికీ అంతే వేతనం ఇస్తున్నారు. క్రమబద్ధీకరణ హామీని తుంగలో తొక్కిన గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా గోపాలమిత్రల మనుగడనే ప్రశ్నార్థకం చేసింది. తమ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని పశుసంవర్థక సహాయకులుగా తీసుకోవాలన్ని వేడుకున్నా ప్రయోజనం లేకపోయింది. దీంతో గోపాలమిత్రల సంఘం ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టడం తో ఖాళీగా ఉన్న రైతు భరోసా కేంద్రాలకు వారిని అనుసంధానం చేశారు.

ఐదు నెలలుగా వేతనం పెండింగ్..!

ఉమ్మడి జిల్లాలో 325 మంది గోపాలమిత్రలు పనిచేస్తున్నారు. వీరికి గత ఐదు నెలలుగా వేతనం పెండింగ్‌లో పెట్టారు. ఉద్యోగం చేరినప్పటి నుంచీ ఏ నెల కూడా సక్రమంగా జీతాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేసి, కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోందని గోపాలమిత్రలు వాపోతున్నారు. వేతన బకాయిలు చెల్లించాలని సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాడి పశువులకు వైద్య సేవలు అందించడంతోపాటు కృత్రిమ గర్భధారణ, పాడి పశువులు, గొర్రెలకు బీమా చేయించడం, సీజనల్ వారిగా వ్యాధుల నివారణకు టీకా వేయడం తదితర పనులు గోపాలమిత్రలు నిర్వహిస్తున్నారు. పశువుల పోషణలో పాడి రైతులకు సూచనలు ఇవ్వడంతోపాటు పశుగ్రాసం పెంపకం ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లోని పశుసంవర్థక సహాయకులు చేసే పనులే తాముా చేస్తున్నా తమకు ఎలాంటి ఆర్థిక ప్రయోజనం లేదని వారు వాపోతున్నారు. పశుసంవర్థక సహాయకులకు నెలకు రూ.35వేలు వేతనం ఇస్తుంటే తమకు కేవలం రూ.6500లు ఇస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు. ఉద్యోగ భద్రతలేకపోగా.. కనీస వేతనాలు ఇవ్వకపోవడంపై వారు ఆందోళన చెందుతున్నారు. తమకు కేటాయించిన విధులకు సంబంధించి కచ్చితమైన ప్రొసీడింగ్స్ ఉండాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు సమాన పనికిసమాన వేతనాలు ఇవ్వాలని కోరుతున్నారు.



మంత్రి నారా లోకేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న గోపాల మిత్రలు (ఫైల్)

వైసీపీ పాలనలో తీరని అన్యాయం

గత వైపీపీ పాలనలో గోపాల మిత్రలకు తీరని అన్యాయం జరిగింది. గత టీడీపీ పాలనలో గోపాలమిత్రలకు కృత్రిమ గర్భధారణ చేసినందుకు ఇన్సెంటివ్ ఇచ్చేవారు. ఒక్కొక్కరు నెలకు దాదాపు రూ.1500 నుంచి రూ.2వేలు ఇన్సెంటివ్ తీసుకునేవారు. సహజ మరణం, ప్రమాదవశాత్తు మరణించిన గోపాల మిత్రుల కుటుంబాలకు రూ.లక్ష పరిహారం అందించేవారు. వైసీపీ పాలనలో వీటిని ఆపేశారు. యువగళం పాదయాత్రలో గోపాలమిత్రల సమస్యలు పరిష్కరిస్తామని నారాలోకేశ్ హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత గోపాలమిత్రల సంఘం నాయకులు మంత్రి నారా లోకేశ్‌ను మరోసారి కలిసి సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం సమర్పించారు. అయినా నేటికీ తమ వేదన తీరలేదని వారు పేర్కొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



గోపాల మిత్రలకు సమాన పనికి సమాన వేతనం అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. 25 సంవత్సరాలుగా నామమాత్రపు వేతనంతో పల్లెల్లో పశువులకు వైద్యసేవలు అందిస్తున్నాం. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఇప్పటి దాకా నెలకు రూ.6500లు వేతనమే చెల్లిస్తున్నారు. గత ఐదు నెలలుగా పెండింగ్‌లోని వేతనాన్ని తక్షణమే చెల్లించాలి. మంత్రి ఇచ్చిన హామి మేరకు మాకు న్యాయం చేయాలి.

-వెంకటేశులు, గోపాల మిత్రల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగ భద్రత కల్పించాలి



గోపాల మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలి. వైసీపీ ప్రభుత్వంలో నిలిపేసిన ఇన్‌సెంటివ్‌లు, ఎక్స్‌గ్రేషియా తదితర సదుపాయాలను పునరుద్ధరించాలి. వైసీపీ పాలనలో మరణించిన గోపాలమిత్రలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వలేదు. ఆయా బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

-వైకుంఠవాసులు, గోపాల మిత్రల సంఘం జిల్లా కార్యదర్శి

డ్రిప్ పరికరాలను సక్రమంగా బిగించాలి

- ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న రఘునాథ్‌రెడ్డి

అనంతపురం అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలను నిబంధనల మేరకు రైతుల పొలాల్లో బిగించాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి సూచించారు. స్థానిక అనంతపురం ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాల నిర్వహణపై ఫీల్డ్ కోఆర్డినేటర్లు, ఎంఐ ఇంజనీర్లు, జిల్లా కోఆర్డినేటర్లకు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ డ్రిప్ పరికరాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల పొలాల్లో ప్రాథమిక పరిశీలన నుంచి అన్ని రకాల పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. తగిన డాక్యుమెంట్లను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు మంజూరు చేసే విషయాన్ని ఆయా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఉమాదేవి, ఏపీఎంఐపీ ఏపీడీ ధనుంజయ, ఎంఐఏఓలు, ఎంఐ ఇంజనీర్లు పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు 551 ప్రత్యేక బస్సులు

- ఆర్టీసీ కడప జోన్ ఈడీ చంద్రశేఖర్

కడప మారుతీనగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కడప జోన్ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఉన్న శైవ క్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం 551 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ కడప జోన్ ఈడీ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం కడపలోని తన చాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శైవక్షేత్రాలను దర్శించుకునేందుకు భక్తులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేసి సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. ఆ మేరకు కడప జోన్ పరిధిలోని తిరుపతి డిపో నుంచి 10 బస్సులు, చిత్తూరు 20, అన్నమయ్య 56, కడప జిల్లా నుంచి 60, కర్నూలు 110, నంద్యాల జిల్లా నుంచి 127, అనంతపురం నుంచి 66, శ్రీసత్యసాయి జిల్లా నుంచి 102 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే బస్సుల కండిషన్‌ను మరింత మెరుగుపరిచి ఎలాంటి అసౌకర్యం కలగకుండా సిద్ధం చేశామన్నారు.

ఎంపీడీఓల సంఘం జిల్లా అధ్యక్షుడిగా రవిప్రసాద్



మంత్రి పయ్యావుల కేశవ్‌కు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న కమిటీ సభ్యులు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఉరవకొండ ఎంపీడీఓ రవిప్రసాద్ ఎన్నికయ్యారు. జడ్పీ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో గురువారం ఆ సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా జడ్పీ సీఈఓ శివశంకర్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రాప్తాడు ఎంపీడీఓ విజయలక్ష్మి, జనరల్ సెక్రటరీగా గుత్తి ఎంపీడీఓ ప్రభాకర్, జాయింట్ సెక్రటరీగా డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ సౌజన్య, కోశాధికారిగా బొమ్మనహాళ్ ఎంపీడీఓ విజయ్ భాస్కర్, రాష్ట్ర ప్రతినిధిగా అనంతపురం రూరల్ ఎంపీడీఓ దివాకర్ ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా లక్ష్మీనరసింహ, మమతాదేవి, కుళ్లాయిస్వామి, వీరరాజు, ధనంజయ, విజయ భాస్కర్, తేజోత్స్న ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

విద్యాశాఖలో వలంటీర్లు..!

- నియామకం దిశగా అడుగులు
- టీచర్ల సర్దుబాటుకు విముఖత
- రాష్ట్రశాఖ ప్రతిపాదనలు.. విద్యాశాఖ జాబితా సిద్ధం

అనంతపురం విద్య, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల (వలంటీర్ల) నియామకానికి అడుగులు పడుతున్నాయి. సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్నచోట వారిని నియమించుకునే దిశగా రాష్ట్ర అధికారులు చర్యలు చేపడుతున్నారు. మిగులు టీచర్ల సర్దుబాటుకు విముఖత చూపుతున్నారను. మెగా డీఎస్సీ నిర్వహించినా ఇంకా పలు ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. సబ్జెక్టు టీచర్‌లేని పాఠశాలలు ఉమ్మడి జిల్లాలో అనేకం ఉన్నాయి. విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల్లో పాఠాలు చెప్పేవారే లేరు. దీంతో బోధన కుంటుపడుతోంది. పదో తరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య మేరకు మిగులు టీచర్లను సర్దుబాటు చేయాలనుకున్నారు. ఇలా చేస్తే రాజకీయ ఒత్తిళ్లు పెరుగుతాయనుకున్నారో.. ఏమోగానీ అధికారులు ఆ నిర్ణయాన్ని మార్చుకున్నారు. అవసరం ఉన్న పాఠశాలలకు ఎడ్యుకేషన్ అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల (వలంటీర్ల)ను తాత్కాలికంగా నియమించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు జిల్లాలో ఎంతమంది సబ్జెక్టు టీచర్ల కొరత ఉందన్న వివరాలను పంపాలని విద్యాశాఖ కమిషనరేట్ నుంచి ఆదేశాలు అందాయి. ఆ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు, ఐటీ సెల్ సిబ్బందితో సమాచారం సేకరించి, రాష్ట్ర శాఖకు రెండురోజుల క్రితం పంపారు. దాదాపు అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో 500కిపైగా సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్నట్లు లెక్కలు తీసి పంపినట్లు చెబుతున్నారు. ఎన్ని అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు అవకాశం కల్పిస్తారోనన్నది రాష్ట్ర శాఖ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని విద్యాశాఖ చెబుతోంది. బీఈడీ ఉన్నవారినే తీసుకుంటారా, డీఎడ్ వారికీ అవకాశం ఇస్తారా అనేదానిపై స్పష్టత లేదు. దీంతో కొంతమంది నిరుద్యోగులకు ఉపాధి దొరకనుంది. అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల ఎంపికపై మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

రాష్ట్రశాఖ నిర్ణయం మేరకే నియామకాలు

టీచర్ల కొరత ఉన్నచోట మిగులు టీచర్లను సర్దుబాటు చేస్తారనుకున్నాం. టీచర్ల సర్దుబాటు లేదని తెలుస్తోంది. బోధన కుంటుపడకుండా అవసరం ఉన్న స్కూళ్లకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమిస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో సబ్జెక్టు టీచర్ల కొరత వివరాలను రాష్ట్రశాఖకు పంపాం. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు ఇక్కడ నియామకాలు చేపడతాం.

-ప్రసాద్‌బాబు, డీఈఓ

ఆస్ట్రేలియాలో మంత్రి లోకేశ్‌కు ఘనస్వాగతం



మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న దగ్గుపాటి మణిహాస్

అనంతపురం క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఆస్ట్రేలియాలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ కుమారుడు దగ్గుపాటి మణిహాస్ ఘనస్వాగతం పలికారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న మంత్రి లోకేశ్ మెల్‌బోర్న్‌లోని మెల్‌బోర్న్ యూనివర్సిటీలో కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడే కెమికల్ ఇంజనీరింగ్ మొదటి ఏడాది చదువుతున్న మణిహాస్.. మంత్రికి స్వాగతం పలికారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రకటనలో పేర్కొంది. మణిహాస్ తనను పరిచయం చేసుకోగానే... మంత్రి లోకేశ్ ఆప్యాయంగా పలకరించారు. చదువు, వాతావరణంపై ఆరాతీశారు. బాగా చదువుకుని రాష్ట్రానికి, తల్లి దండ్రులకు మంచి పేరు తేవాలని మంత్రి సూచించారు. 'రాష్ట్రాభివృద్ధి కోసం మీరు పడుతున్న తపన గురించి ఆస్ట్రేలియాలోని తెలుగువారే కాకుండా ఇక్కడి ప్రముఖులు కూడా చర్చించుకుంటున్నారని, మీరే స్ఫూర్తి' అంటూ మంత్రి వద్ద మణిహాస్ ప్రస్తావించారు. దీంతో బాగా చదువుకోవాలంటూ ఆయన మణిహాస్‌కు విషెస్ తెలిపారని ప్రకటనలో పేర్కొన్నారు.

ఉచిత బస్సు... ఆరోగ్యమస్తు..!

(5వ పేజీ తరువాయి)

సరిహద్దు మండలాల మహిళలు సర్వజన వైద్యశాలకే వస్తున్నారు. దీంతో మహిళా ఓపీ పెరిగింది. అవసరమైన వారిని అడ్మిషన్ చేసుకుని, వైద్యసేవలు అందిస్తున్నామనీ, కడుపునొప్పి, గర్భసంచి, చెవి, కళ్ల వంటి ఆపరేషన్లు చేస్తున్నామని వైద్యవర్గాలు వివరిస్తున్నాయి.

పెరిగిన శాతం...

ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నిత్యం రెండువేల నుంచి మూడువేల వరకు ఓపీ నమోదవుతోంది. సాధారణంగా ఎక్కువశాతం పురుషులే ఆస్పత్రికి వస్తారు. ఉచిత బస్సు పథకం ప్రారంభం నుంచి ఓపీ గణాంకాల్లో మార్పులు వచ్చాయి. పురుషుల కంటే మహిళా ఓపీ పెరిగింది. జనరల్ మెడిసిన్, గైనిక్, సర్జరీ, ఈఎన్‌టీ, ఆప్తాలమిక్ ఓపీలకు మహిళలు ఎక్కువగా వస్తున్నారు. గత నెలలో ఏకంగా 38,982 మంది మహిళలు ఓపీ చూపించుకోవడం ఇందుకు నిదర్శనమని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి.



గైనిక్ ఓపీలో మహిళలు

మహిళల సంఖ్య పెరిగింది



కంటి విభాగంలో మహిళల ఓపీ సంఖ్య పెరుగుతూ వస్తోంది. పలు మండలాల నుంచి మహిళలు తరలివస్తున్నారు. వారికి ఉచిత బస్సు ప్రయాణం వరమనే చెప్పాలి. ఓపీకి వచ్చిన మహిళలకు పరీక్షలుచేసి అవసరమైన ఐడ్రాప్స్, మెడిసిన్ ఇస్తున్నాం. చూపు మందగించిన వారికి కళ్లద్దాలను సూచిస్తున్నాం. తప్పనిసరి అయినవారికి అడ్మిషన్ చేసుకుని, ఆపరేషన్ చేస్తున్నాం. నేత్ర సమస్యలు చాలా సున్నితమైనవి. వీలైనంత తొందరగా పరీక్షలు నిర్వహించి తగిన వైద్యం చేయించుకుంటే సమస్య నుంచి బయటపడవచ్చు.

-డాక్టర్ కస్తూరిబాయి, కంటి విభాగాధిపతి, సర్వజనాస్పత్రి

సద్వినియోగం అవుతోంది



రోజుకు 300మందికిపైగా మహిళా ఓపీ నమోదవుతోంది. వారిలో అత్యధికంగా గ్రామీణ, మండల ప్రాంత మహిళలే ఉంటున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు సద్వినియోగం అవుతుందనే చెప్పాలి. ఓపికి వచ్చిన వారిని అవసరమైతే రక్తపరీక్షలు, స్కానింగ్‌కు సిఫార్సు చేస్తున్నాం. సాధారణ జబ్బుల నుంచి దీర్ఘకాలిక వ్యాధులుగా రూపాంతరం చెందకుండా తగిన సమయంలోనే చికిత్సలు పొందేందుకు దోహదపడుతోంది.

-డాక్టర్ మాధవి, జనరల్ మెడిసిన్ విభాగం

సీనియార్టీ జాబితా ప్రకటించాలని వినతి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల కు సీనియార్టీ జాబితా ప్రకటించి, పదోన్నతులు కల్పించాలని ఆ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు కోరారు. స్థానిక రామ్‌నగర్‌లో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, లక్ష్మీనారాయణ, వరప్రసాద్, మల్లికార్జున, చంద్ర, చిన్నారప్ప, శివశంకర్, రామకృష్ణ, కిశోర్, విమల, నారాయణస్వామి, నాగరాజు, కృష్ణమూర్తి, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

దొంగల సవాల్..!

ఒక కేసు ఛేదించకముందే మరో నేరం

- వరుస దొంగతనాలతో ప్రజల బెంబేలు
- నామమాత్రంగా పోలీసుల గస్తీ
- నియంత్రణకు తగినంత సిబ్బంది కరువు



కేశవరెడ్డి పాఠశాలలో చోరీ చేస్తున్న దొంగలు

బుక్కరాయసముద్రం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో కొన్ని రోజులుగా దొంగల బెడద ఎక్కువైంది. కాలేజీలు, ఆలయాలు, ఇళ్లు, వ్యవసాయ పొలాల్లో విద్యుత్ మోటార్లు, విద్యుత్ వైర్లు, డ్రిప్ వైర్లు, చివరికి పశువులను కూడా వదలడం లేదు. పోలీసులు ఒక కేసును ఛేదించకముందే మరో చోరీ చేస్తూ సవాల్ విసురుతున్నారు. సిబ్బంది కొరతతో నేరాలను నియంత్రించడం కష్టంగా మారిందని పోలీసులు చెబుతున్నారు. ఉన్నవారితో కనీసం గస్తీ కూడా నిర్వహించడం లేదని స్థానిక ప్రజలు పెదవి విరుస్తున్నారు.



బీరువాలో నగదును ఎత్తుకెళ్లిన దొంగలు

మచ్చుకు కొన్ని...

ఈనెల 2న బుక్కరాయసముద్రం పరిధిలోని దక్షిణామూర్తినగర్‌లో రెండు ఇళ్లలో వరుస చోరీలు జరిగాయి. రూ.లక్షల విలువైన బంగారం ఆ భరణాలు చోరీ అయ్యాయి.

- ఈ నెల 5న వడియంపేట గ్రామంలో నాలుగు కార్పొరేట్ కళాశాలల్లో చోరీ జరిగింది. దాదాపు రూ. 4 లక్షలు ఎత్తికెళ్లారు.
- ఈ నెల 7న బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ ఆటో వెళ్తుండగా ఇద్దరు మహిళా దొంగలు మాటల్లో పెట్టి ఆమె నుంచి రూ. 4లక్ష విలువైన బంగారు చైను కాజేశారు.
- గత నెల 13న బుక్కరాయసముద్రంలో రాత్రిపూట మద్యం దుకాణంలో చొరబడి రూ.20వేలు, మద్యం ఎత్తికెళ్లారు.
- ఆగస్టు 6న బుక్కరాయసముద్రంలో గౌరవయ్యసేను కొట్టాలలో ఆరు తులాల బంగారం, రూ.3.3లక్షల నగుదు చోరీ చేశారు. అయితే ఈ ఘటనలో పోయిన సొమ్మును రికవరీ చేశారు.
- జూలై 21 స్థానిక ముసలమ్మకట్ట వద్ద ఉన్న ముసలమ్మ ఆలయంలో హుండీలో ఉన్న రూ.2లక్షలు చోరీ చేశారు. ఈ ఘటనలో దొంగలు ఆచూకీ తెలియలేదు. గత నెలలో దొంగతనం చేసిన డబ్బును తిరిగి ఆలయంలో పడేసి వెళ్లారు.
- మండలంలో పసులూరు గ్రామం వద్ద వెళ్లే రహదారిలో మే 3న బుక్కరాయ సముద్రం గ్రామానికి చెందిన గొర్రెల వ్యాపారి నారాయణస్వామి అనంతపురం రూరల్ పరిధిలోని ఉప్పరపల్లి గ్రామానికి వెళ్తుండగా అతని నుంచి రూ.6.80లక్షలను దోపిడీ చేశారు.

జనాభాకి అనుగుణంగా... పోలీసు ఏదీ?

జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న బుక్కరాయసముద్రం మండలంలో దాదాపు 75 వేల జనాభా ఉంది. వీటితో పాటు జాతీయ రహదారి, అమరావతి హైవేపై నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయి. సెంట్రల్ యూనివర్సిటీ, జిల్లాజైలు, ఓపెన్ ఎయిర్‌జైలు, వ్యవసాయ పరిశోధన కేంద్రాలు, పశు పరిశోధన కేంద్రం, గురుకుల పాఠశాలలు ఉన్నాయి. ఫ్యాక్షన్ గ్రామాలు ఏ గ్రేడ్ స్థాయిలో 3 గ్రామ పంచాయతీలు, బీ గ్రేడ్ సమస్యాత్మక గ్రామ పంచాయతీలు 4, అక్రమ రవాణా, ఇసుక, ఎర్ర మట్టి వాహనాలు నిత్యం తిరుగుతుంటాయి. ప్రస్తుతం స్టేషన్‌లో ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, ముగ్గురు ఏఎస్‌ఐలు ఉండగా అందులో ఒక ఏఎస్‌ఐ డీఎస్పీ కార్యాలయం అటాచ్‌లో ఉన్నారు. ఐదుగురు హెడ్ కానిస్టేబుళ్లలో ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఒకరు మెడికల్ లీవ్‌లో, మరొకరు హైవే పెట్రోలింగ్‌కు వెళ్లారు. 18 మంది కానిస్టేబుళ్లు ఉండగా కోర్టు డ్యూటీ 2, స్పెషల్ పార్టీకి 1, స్టేషన్‌లో కంప్యూటర్ వర్క్ 2, రైటర్లు 3 ఉన్నారు. మిగిలిన పది మంది సిబ్బంది మండలం అంతా పర్య వేక్షించాలంటే చాలా కష్టంగా ఉంది. స్టేషన్ అప్‌గ్రేడ్ అయినా నిబంధనల మేరకు ఉండాల్సినంత మంది సిబ్బంది లేరు. దీంతో సిబ్బందికి లీవ్ దొరకాలన్నా కూడా కష్టంగా మారింది.



బీకేఎస్‌లో ఇటీవల మద్యం దుకాణంలో చోరీపై విచారిస్తున్న పోలీసులు

కట్టడి చేస్తాం



బుక్కరాయసముద్రం మండలం విస్తీర్ణంలో చాలా పెద్దది. ప్రస్తుతం ఉన్న సిబ్బంది నేర నియంత్రణకు సరిపోవడం లేదు. సిబ్బందిని పెంచి దొంగతనాలు జరగకుండా నియంత్రిస్తాం. బ్లూకోల్ట్స్‌కు నలుగురిని కేటాయిస్తాం. ప్రస్తుతం జరిగిన చోరీలపై ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేస్తున్నాం. త్వరలోనే నేరస్తులను పట్టుకుంటాం. గ్రామాల్లో ఇంటికి తాళాలు వేసి వెళ్లే సమయాల్లో పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి. అలాగే విలువైన వస్తువులు, బంగారం ఇంట్లో పెట్టకుండా భద్రత ఉండే ప్రదేశాల్లో పెట్టాలి.

-వెంకటేశులు, రూరల్ డీఎస్పీ

వీడిన వైసీపీ గ్రహణం

పీఏబీఆర్ కుడి కాలువకు మరమ్మతులు

శరవేగంగా పనులు... అన్నదాతల హర్షం



రాప్తాడు మండలం యర్రగుంట సమీపంలో మరమ్మతుల అనంతరం కాలువ, రోడ్డు

రాప్తాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడి కాలువకు ఆరేళ్లగా వైసీపీ గ్రహణం పట్టింది. కాలువ మరమ్మతులకు పైసా కూడా నిధులివ్వలేదు. దీంతో కాలువలో కంపచెట్లు పెరిగిపోయి, పూడిక పేరుకుపోయి నీరు ముందుకు కదిలే పరిస్థితి ఉండేది కాదు. కూటమి ప్రభుత్వం కాలువ మరమ్మతులు చేపట్టింది. కాలువతోపాటు అనుబంధంగా ఉండే రోడ్డు మరమ్మతులకు రూ.2 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో పనులు శరవేగంగా సాగుతున్నాయి. దాదాపు పూర్తి కావచ్చాయి. ఆరేళ్ల తరువాత కాలువకు మరమ్మతులు చేపడుతుండడంతో వైసీపీ గ్రహణం వీడిందన్న చర్చలు వినిపిస్తున్నాయి. కాలువ మరమ్మతులతో చివరి ఆయకట్టుకు కూడా నీరు చేరనుంది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుడి కాలువ ద్వారా కూడేరు, ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు, కనగానపల్లి బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లోని 49 చెరువులకు నీరు సరఫరా అవుతాయి. త్వరలోనే నీటిని వదలనున్నట్లు కుడి కాలువ ధర్మవరం ఏఈ శ్రీనివాసులు తెలిపారు.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో గురువారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిగా రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 17 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

మగ్గానికి వేలాడిన నేతన్న


నీలూరి రాజేశ్ (ఫైల్)

ధర్మవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అప్పుల మగ్గానికి మరో నేతన్న వేలాడాడు. స్థానిక చంద్రబాబునగర్‌లో చేనేత కార్మికుడు నీలూరి రాజేశ్(30) అప్పుల బాధ భరించలేక గురువారం మగ్గానికి ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చంద్రబాబునగర్‌కు చెందిన రాజేశ్ కూలిమగ్గం నేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. నేసిన చీరలకు గిట్టుబాటు ధర దక్కక కుటుంబ అవసరాలకు అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనిపించక గురువారం సాయంత్రం ఇంట్లో మగ్గానికే చీరతో ఉరివేసుకున్నాడు. బయటకు వెళ్లిన భార్య గంగరత్నమ్మ ఇంటికి వచ్చి తలుపులు తీయడానికి ప్రయత్నించగా.. రాలేదు. అనుమానం వచ్చి స్థానికుల సాయంతో తలుపులు బద్దలుకొట్టి, లోపలికి వెళ్లగా ఉరికి వేలాడుతున్న భర్తను చూసి బోరున విలపించింది. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. గంగరత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, విచారణ చేపట్టారు. రాజేశ్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వ్యక్తి హత్య

తాడిపత్రి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీబీరోడ్డు అభిరుచి హోటల్ సమీపంలో గురువారం తెల్లవారుజామున రాజు (52) అనే వ్యక్తిని గుర్తుతెలియని దుండగులు హత్య చేసినట్లు సీఐ ఆరోహణరావు తెలిపారు. ఆయన తెలిపిన మేరకు భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన రాజు పెయింటింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇతడికి మద్యం తాగే అలవాటు ఉండేది. ఈనేపథ్యంలో బుధవారం రాత్రి మద్యం తాగి ఇంటికి వెళ్లలేదన్నారు. ఏం జరిగిందో తెలియదు గానీ తెల్లవారుజామున హత్యకు గురయ్యాడన్నారు. మృతదేహాన్ని పరిశీలించగా రాళ్లతో దాడి చేసి చంపినట్లు గుర్తించామన్నారు. భార్య ఉత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

ఉద్యోగాల పేరుతో మోసం

ఉరవకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వర్క్ ఫ్రం హోమ్ పేరుతో పలువురు నిరుద్యోగులను మోసగించిన విషయం ఉరవకొండలో వెలుగు చూసింది. ఓ కంపెనీ వ్యాట్సాప్ ద్వారా వర్క్ ఫ్రం హోమ్‌తో శాశ్వత ఉద్యోగాలు కల్పిస్తామని మెసేజ్‌లు పంపారు. నెలకు రూ.15 నుంచి రూ.30వేల వరకూ సంపాదించవచ్చని ఆశ చూపారు. సంప్రందించిన కొందరు నిరుద్యోగులకు ఉద్యోగం కావాలంటే ఫోన్ పే చేయాలని చెప్పారు. వారి మాటలు నమ్మిన కొందరు నిరుద్యోగులు రూ.6 వేలు, రూ.12వేలు ఫోన్ పే చేశారు. ఉరవకొండ పరిసర ప్రాంతాల్లో ఇలా 50 మందిదాకా డబ్బులు చెల్లించారు. ఆన్‌లైన్ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని నమ్మించారు. ఆ తర్వాత ఫోన్ స్విచాఫ్ చేయడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మోసపోయిన బాధితులు వివరాలను వెల్లడించడానికి నిరాకరిస్తున్నారు.

పెళ్లి పేరిట వంచన

● గర్భందాల్చి.. ప్రసవించిన బాలిక

యాడికి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఓ బాలికను గర్భవతిని చేసిన రాజ అనే వ్యక్తిపై యాడికి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. యూపీఎస్ సీఐ ఈరన్న తెలిపిన మేరకు, నిందితుడు కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణవాసి. బాధిత బాలిక యాడికి మండలంలోని ఓ గ్రామంలో పదో తరగతి వరకు చదివింది. ఆ తరువాత చదువు మానేసి కర్నూలు జిల్లా మద్దికెరలోని తన నాన్నమ్మ ఇంట్లో ఉండేది. మద్దికెరకు ఒక వివాహంలో పాల్గొనేందుకు వచ్చిన రాజ.. బాలికకు పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. దసరా పండుగకు తల్లిదండ్రుల వద్దకు వచ్చిన బాలిక, ఈ విషయం గురించి తెలియజేసింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే గర్భందాల్చిన బాలిక, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో బుధవారం రాత్రి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలిక గురువారం తెల్లవారుజామున ఆడబిడ్డకు జన్మనిచ్చింది. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు బాలిక తల్లిదండ్రులు ఉంటున్న ప్రాంతానికి వెళ్లి విచారించారు. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు అంగన్‌వాడీ వర్కర్, మహిళా సంరక్షణ కార్యదర్శి స్టేషన్‌కు వెళ్లారు. బాలిక అనంతపురంలో ప్రసవించినందున, అక్కడే ఫిర్యాదు చేయాలని పోలీసులు వారికి సూచించారు. దీంతో వారు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వివరాలను సేకరిస్తున్నారు.

వ్యక్తిని కాపాడిన రైల్వే పోలీసులు


సాయినాయక్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసు

తాడిపత్రి, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్‌రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోబోయిన సాయినాయక్‌ను రైల్వే పోలీసులు శివారెడ్డి, వరప్రసాద్ రక్షించారు. వారు తెలిపిన మేరకు నంద్యాల జిల్లా కొలిమిగుండ్లకు చెందిన సాయినాయక్ ఇంటిలో గొడవ పడి, మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకోవాలని భావించాడు. ఈక్రమంలో రైలుకింద పడి చనిపోవాలని తాడిపత్రి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. ఓ గూడ్సు రైలు వస్తుండగా ఎదురు వెళ్లాడు. దీన్ని గమనించిన రైల్వే పోలీసులు అప్రమత్తమై అతడిని కాపాడారు. తర్వాత అతన్ని విచారించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తర్వాత అతడి కుటుంబ సభ్యులను పిలిపించి వారికి అప్పగించారు.

వివరాల నమోదులో నిర్లక్ష్యం తగదు: డీపీఓ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో వివరాల నమోదులో నిర్లక్ష్యం తగదని డీపీఓ నాగరాజనాయుడు.. సిబ్బందికి సూచించారు. స్థానిక డీపీఓ కార్యాలయంలో గురువారం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్ నిర్వాహణపై ఆరా తీశారు. పూర్తిస్థాయిలో వివరాలు నమోదు చేసేలా చూడాలన్నారు. ఐవీఆర్‌ఎస్ ప్రణాళిక ప్రకారం అమలయ్యేలా చూడాలన్నారు. ప్రజాఫిర్యాదులన్నింటినీ పరిష్కరించాలన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్లు ఉషారాణి, భారతి, జూనియర్ అసిస్టెంట్లు ఉషశ్రీ, శాలిని, సాయి పాల్గొన్నారు.

సస్యరక్షణతోనే కందిలో అధిక దిగుబడులు

● పుట్టపర్తి ఏరువాక కోఆర్డినేటర్ రామసుబ్బయ్య

ధర్మవరం రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కందిపంటలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని పుట్టపర్తి ఏరువాక కోఆర్డినేటర్, శాస్త్రవేత్త రామసుబ్బయ్య రైతులకు సూచించారు. మండలంలోని చిగిచెర్ల గ్రామసమీపంలో కందిపొలాలను ఏడీఏ లక్ష్మానాయక్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం కంది సాకీయదశ పూత, కాయ అభివృద్ధి దశలో ఉన్నట్లు వెల్లడించారు. జూన్, జూలై మాసంలో విత్తన సాగు చేసిన పంట మొగ్గదశ నుంచి కాయదశకు చేరుకుందని, ఈ సమయంలో వేపనూనె 5.0మిల్లీమీటర్లు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. కందికి తెగుళ్లు వ్యాపిస్తే వెంటనే వ్యవసాయాధికారులను సంప్రదించి సకాలంలో మందులు పిచికారి చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. తప్పనిసరిగా క్రాప్ బుకింగ్ చేయించుకో వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ముస్తఫా, గ్రామరైతులు, సిబ్బంది పాల్గొన్నారు.


కందిపంటలో జాగ్రత్తలపై రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్త రామసుబ్బయ్య

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

● పంచాయతీరాజ్ ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు


మాట్లాడుతున్న ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు.

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీరాజ్ విభాగంలో పలు అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు ఆదేశించారు. పీఆర్ఎస్ఈ కార్యాలయంలో గురువారం ఆయన జిల్లాలోని డీఈలు, ఏఈలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా అనుమతులు పొందిన పనులకు సంబంధించి ప్రాంతాల వారిగా డీఈలతో సమీక్ష నిర్వహించారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు చర్యలు చేపట్టాలన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లను పూర్తి చేయడానికి అనుమతులు వచ్చాయన్నారు. ఇలాంటివి జిల్లాలో 67 ఉన్నట్లు వెల్లడించారు. వీటిని నేషనల్ హెల్త్ మిషన్ పథకం ద్వారా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే 15వ ఆర్థిక సంఘం ద్వారా ప్రతి భవన నిర్మాణానికి రూ.36 లక్షల వ్యయంతో నూతనంగా 38 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించడానికి అనుమతులు వచ్చినట్లు తెలిపారు. పీఎం ఏబీహెచ్ఐఎమ్ కింద మంజూరైన 24 క్లినిక్‌ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. మంజూరైన పనులను గడువులోపు పూర్తి చేయడానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఈఈ ప్రభాకర్‌రెడ్డి, డీఈలు లక్ష్మీనారాయణ, క్రిష్ణజ్యోతి, రాజన్న, సుధాకర్‌నాయక్, యల్లమనాయుడు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో పురోగతి కనిపించాలి: పంచాయతీరాజ్‌లోని పీఐయూ (ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్) ద్వారా చేపడుతున్న పనుల్లో పురోగతి కనిపించాలని ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు.. ఇంజనీర్లను ఆదేశించారు. స్థానిక పీఆర్ సర్కిల్ కార్యాలయంలో పీఐయూ సిబ్బందితో గురువారం సాయంత్రం సమావేశం ఏర్పాటు చేశారు. ఆ విభాగంలో చేపడుతున్న పనులపై సమీక్ష చేశారు. పీఎంజీఎస్ఆర్ కింద 16 పనులకు సంబంధించి అంచనాలు తయారు చేసి, అనుమతుల కోసం పంపామని ఎస్ఈ తెలిపారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఈఈ శ్రీరాములు, డీఈలు నారాయణస్వామి, రాజేశ్వరరెడ్డి, డీఎల్ మురళి పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.33

అనంతపురంరూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో గురువారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.33తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.17, సరసరిగా రూ.24తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 975 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

రేపు జాబ్‌మేళా

గుంతకల్లుటౌన్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో గురువారం జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో 25న ఉదయం జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. 18 నుంచి 35 ఏళ్లలోపు వారు పాల్గొనవచ్చన్నారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. వివరాలకు 6304426349, 8096763970 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెగా సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

అనంతపురంరూరల్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ పరిధిలో ఈ ఏడాది మే, జూన్‌లో నిర్వహించిన యూజీ మెగా సప్లిమెంటరీ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ ఫలితాలను గురువారం విడుదల చేశారు. వీసీ ప్రొఫెసర్ అనిత ఫలితాలను విడుదల చేశారు. మనబడి, స్కూల్స్9 వెబ్‌సైట్‌లో ఫలితాలు అందుబాటులో ఉంటాయన్నారు. రీవాల్యుయేషన్, వ్యక్తిగత వెరిఫికేషన్ కోసం నవంబరు 8వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మునినారాయణప్ప, ప్రొఫెసర్ శోభలత, డా.లక్ష్మయ్య, స్మిత, డెరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ వెంకటరమణ, పరీక్షల కంట్రోలర్ శ్రీరామ్ నాయక్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

న్యామద్దల సచివాలయ సర్వేయర్ సస్పెన్షన్

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని న్యామద్దల సచివాలయం-1లో సర్వేయర్‌గా పనిచేస్తున్న హేమంత్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ బాలకృష్ణుడు గురువారం తెలిపారు. ఈనెల సామాజిక పింఛన్ల సొమ్ము రూ.39 వేలు సర్వేయర్ తిరిగి వెనక్కి ఇవ్వకుండా, సమాచారం కూడా ఇవ్వకుండా విధులకు గైర్హాజరయ్యారన్నారు. దీనిపై అతడికి నోటీసు జారీ చేశామన్నారు. గ్రామంలో రీసర్వే విధులకు సర్వేయర్ సక్రమంగా హాజరు కావడంలేదన్నారు. సమాచారం లేకుండా విధులకు గైర్హాజరవుతుండటంతో సంబంధిత జిల్లా అధికారులకు నివేదిక ఇచ్చామన్నారు. ఆ మేరకు సర్వేయర్ హేమంత్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ విజయశాంతిబాయి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

26న ఆర్చరీ జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్చరీ సబ్‌జూనియర్స్ బాల, బాలికల ఎంపిక పోటీలు ఈనెల 26న ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. 2008 జనవరి 1లోపు జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు జననధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు నవంబరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 9949279330ను సంప్రదించాలని కోరారు.

నేడు, రేపు సైన్స్ ప్రాజెక్టులపై సదస్సులు

అనంతపురం విద్య, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): సైన్స్ టీమ్స్ వివరాలు, సైన్స్ ప్రాజెక్టుల నమోదు, ప్రాజెక్టుల ఎంపికపై అవగాహన కల్పించడం కోసం శుక్ర, శనివారాల్లో సదస్సులు ఏర్పాటు చేసినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, సైన్స్ సెంటర్ అధికారి బాలమురళి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వికసిత్ భారత్ బిల్డ్ థాన్- 2025 కార్య క్రమానికి విద్యార్థుల నుంచి నూతన ఆలోచనలు, శాస్త్రీయపరిష్కారాల ఆవిష్కరణకు సంబంధించి ఈసదస్సులో అవగాహన కల్పిస్తారన్నారు. శుక్రవారం ఉదయం గుంతకల్లు , మధ్యాహ్నం కళ్యాణదుర్గం డివిజన్‌లకు, శనివారం ఉదయం అనంతపురం డివిజన్, మధ్యాహ్నం అన్ని ప్రైవేట్ పాఠశాలలకు ఈసదస్సులు కొనసాగుతాయన్నారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాల నుంచి ఒక సైన్స్ టీచర్, ఒకవిద్యార్థి తప్పనిసరిగా హాజరయ్యేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని డీఈఓ ఆదేశించారు.

దరఖాస్తు చేసుకోండి

బుక్కపట్నం/అనంతపురం విద్య, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం డైట్ కళాశాలలో డెప్యుటేషన్‌పై బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, అనంతపురం డీఈఓ డీఈఓ ప్రసాద్‌బాబు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రభుత్వ, జిల్లాపరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు అవకాశం ఉంటుందన్నారు. ఈనెల 31వ తేదీ నాటికి గరిష్ఠంగా 58 ఏళ్ల వయసు, స్కూల్ అసిస్టెంట్‌గా ఐదేళ్ల బోధనానుభవం, సబ్జెక్టులో పీజీ, ఎంఈడీలో 55 శాతం మార్కులతో పాసై, ఇంగ్లిష్, కంప్యూటర్ ప్రావీణ్యం ఉన్నవారు అర్హులన్నారు. ఈనెల 29వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నవంబరు 5 నుంచి 8వతేదీ వరకు రాత పరీక్ష నిర్వహిస్తారన్నారు. అర్హత, ఆసక్తి గల స్కూల్ అసిస్టెంట్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తర్వాత దరఖాస్తు, విద్యార్హత పత్రాలను డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అందించాలన్నారు. బుక్కపట్నం డైట్‌లో ఖాళీల వివరాలను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచామని డీఈఓ తెలిపారు.

రద్దీ నియంత్రణకు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు కంటోన్మెంటు-కలబురగి (06557) ప్రత్యేక రైలు ఈ నెల 23న, దీని తిరుగు ప్రయాణపు రైలు (06558) 24న నడుపుతున్నట్లు తెలియజేశారు. ఈ రైలు యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాద్గిర్, షాహాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. బెంగళూరు-బరైనీ (06247) ఈ నెల 23న, దీని తిరుగు ప్రయాణపు రైలు (06248)ను 26న నడపనున్నట్లు వివరించారు. ఈ రైలు యలహంక, హిందూపురం, ధర్మవరం, డోన్, కాచిగూడ, ఖాజీపేట్, బాలార్షా, నాగపూర్, ఇటార్సి, జబల్పూర్, సట్నా, ప్రయాగరాజ్ చౌకీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్, బక్సర్, అర, దానాపూర్, పాటలీపుత్ర, సోన్‌పూర్, హాజీపూర్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

నేడు ఐఏబీ సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐఏబీ(ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు) సమావేశం శుక్రవారం జిల్లా పరిషత్ ఆవరణలోని డీపీఆర్‌సీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించే ఐఏబీ సమావేశానికి ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారన్నారు.

ఆదాయ వనరులను పెంచుకోండి

● జడ్పీ సీఈఓ శివశంకర్

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఆదాయ వనరులను పెంచుకోవాలని జడ్పీ సీఈఓ శివశంకర్ పేర్కొన్నారు. జడ్పీ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులు పెంపొందించుకోవడంపై ఉమ్మడి జిల్లా ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ గురువారం ముగిసింది. ఈ కార్యక్రమానికి జడ్పీ సీఈఓ శివశంకర్, డ్వామా పీడీ సలీం బాషాలు హాజరై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇక్కడ శిక్షణలో నేర్చుకున్న అంశాలను, క్షేత్రస్థాయిలో అమలు చేసి, అభివృద్ధికి బాటలు వేసుకోవాలన్నారు. డ్వామా పీడీ సలీం బాషా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే మెటీరియల్ కాంపోండ్ పనులకు తప్పనిసరిగా టెండర్ ప్రాసెస్‌ను అనుసరించాలన్నారు. జిల్లాలోని 12 మండలాల్లో 31 గ్రామాల్లో వాటర్ హార్వేస్టింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. అందుకు అనుగుణంగానే క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం మీద నిర్వహించే టెలీకాన్ఫరెన్స్‌కు అందరూ హాజరు కావాలన్నారు. తద్వారా సమాచార లోపం తలెత్తే అవకాశం ఉండద న్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డీడీఓ నాగశివలీలా, ట్రైనర్ సౌజన్య, ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ శివశంకర్

బీఎస్ఎన్ఎల్ బొనాంజా ఆఫర్లు

● నవంబరు 18 వరకూ అవకాశం
● పీజీఎం ముజీబ్ పాషా

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకుని బీఎస్ఎన్ఎల్.. వినియోగదారులకు బొనాంజా ఆఫర్లను ప్రవేశపెట్టిందని ఆ సంస్థ పీజీఎం ముజీబ్ పాషా గురువారం ప్రకటనలో తెలిపారు. దీపావళి బొనాంజా, కార్పొరేట్ కాంబో, గిఫ్ట్ రీచార్జ్, సీనియర్ సిటిజన్ ప్లాన్, సెలెక్టెడ్ ప్లాన్లపై 5 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామన్నారు. ప్రస్తుత వినియోగదారులతోపాటు కొత్తవారికి కూడా ఈ ఆఫర్లు వర్తిస్తాయన్నారు. దీపావళి బొనాంజా ఆఫర్‌లో రూపాయికే 30 రోజులపాటు అపరిమిత ఉచిత వాయిస్ కాల్స్, రోజూ 2జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు వర్తిస్తాయన్నారు. సిమ్ కార్డు ఉచితంగా ఇస్తారన్నారు. ఈ ఆఫర్ నవంబరు 15 వరకూ అమల్లో ఉంటుందన్నారు. కార్పొరేట్ కాంబో ఆఫర్‌లో భాగంగా ఏదేని కార్పొరేట్ సంస్థ పది, అంత కంటే ఎక్కువ పోస్టు పెయిడ్, ఒక ఎఫ్‌టీటీహెచ్ కనెక్షన్ తీసుకుంటే మొదటి నెల రీచార్జిపై 10 శాతం డిస్కౌంట్ లభిస్తుందన్నారు. ఈ ఆఫర్ నవంబరు 18 వరకూ అమల్లో ఉంటుందన్నారు. గిఫ్ట్ రీచార్జి ఆఫర్ నవంబరు 18 వరకూ బీఎస్ఎన్ఎల్ సెల్ఫ్ కేర్ యాప్ ద్వారా మిత్రులకు, కుటుంబసభ్యులకు రీచార్జి చేస్తే ఆ మొత్తంలో 25 శాతం డిస్కౌంట్ లభిస్తుందన్నారు. సీనియర్ సిటిజన్ ప్లాన్‌లో 1,812 రూపాయలకే 365 రోజుల అపరిమిత ఉచిత వాయిస్ కాల్స్, రోజూ 2జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు వర్తిస్తాయన్నారు. సిమ్ కార్డు ఉచితంగా ఇస్తామన్నారు. ఆరు నెలలపాటు బీఐ టీవీ సబ్‌స్క్రిప్షన్ ఇస్తామన్నారు. ఈ ఆఫర్ 60 ఏళ్లు పైబడిన వారికి మాత్రమే వర్తిస్తుందన్నారు. నవంబరు 18 వరకూ అమల్లో ఉంటుందన్నారు. సెలెక్టెడ్ ప్లాన్లపై 5 శాతం డిస్కౌంట్ ఆఫర్‌లో రూ.485, రూ.1999పై నవంబరు 18వ తేదీ వరకూ బీఎస్ఎన్ఎల్ సెల్ఫ్‌కేర్ యాప్ ద్వారా రీచార్జి చేస్తే రీచార్జి అమౌంట్‌లో 5 శాతం డిస్కౌంట్ లభిస్తుందన్నారు.


విత్తనం వేస్తున్న రైతులు

8 గంటల్లో 20 ఎకరాల్లో విత్తనం

బొమ్మనహాళ్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని గోవిందవాడ గ్రామానికి చెందిన ఎర్రిస్వామి తన ఎద్దులతో ఏకంగా 8 గంటల వ్యవధిలో 20 ఎకరాల్లో అలసంద విత్తి, శెభాష్ అనిపించుకున్నాడు. గ్రామానికి చెందిన చెన్నబసయ్యకు చెందిన పొలంలో గురువారం విత్తనం వేశాడు. తెల్లవారుజామున 5 గంటలకు కాడెద్దులతో విత్తు పని ప్రారంభించిన ఆయన మధ్యాహ్నం ఒంటి గంటకు 20 ఎకరాల్లో పూర్తి చేశాడు.

బీటీపీకి వరదనీరు


బీటీపీలో చేరిన వరదనీరు

రాయదుర్గం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భైరవాన్ తిప్ప ప్రాజెక్టులోకి కర్ణాటక నుంచి వరదనీరు ఉధృతంగా వచ్చి చేరుతోంది. ప్రస్తుతం 700 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశాలున్నట్లు ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో శుక్రవారం క్రస్ట్‌గేట్లను ఎత్తి నీటిని విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం రెండు టీఎంసీలు కాగా ఇప్పటికే 1.57 టీఎంసీలు చేరాయి. ఎగువన కర్ణాటకలోని వాణివిలాస్ సాగర్ నిండిపోవడంతో అక్కడి నుంచి రెండువేల క్యూసెక్కులకుపైగా నీటిని అవుట్‌ఫ్లో చేస్తున్నారు. దీంతో ఆ నీరంతా బీటీపీకి చేరే అవకాశం ఉంది. ఇన్‌ఫ్లో పెరిగి, నీటిని దిగువకు విడుదల చేయనున్న నేపథ్యంలో దిగువన నదీ పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలకు ఇరిగేషన్ అధికారులు అప్రమత్తం చేశారు.

ఏపీ జట్టు ఫిట్‌నెస్ కోచ్‌గా బొమ్మన్న



అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్-19 మహిళా క్రికెట్ జట్టు ఫిట్‌నెస్ కోచ్‌గా జిల్లాకు చెందిన బొమ్మన్న నియమితుడయ్యారు. మహారాష్ట్రలో ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహించే బీసీసీఐ అండర్-19 మహిళా జాతీయ క్రికెట్ టోర్నీలో ప్రాతినిధ్యం వహించనున్న రాష్ట్ర జట్టుకు బొమ్మన్న ఫిట్‌నెస్ కోచ్‌గా వ్యవహరించనున్నారు. కంబదూరు మండలం నూతిమడుగు గ్రామానికి చెందిన బొమ్మన్న రాష్ట్ర జట్టుకు కోచ్‌గా నియమితుడవడం పట్ల జిల్లా క్రికెట్ వర్గాలు అభినందనలు తెలిపాయి.

రెజ్లింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో డీవీఈఓ వెంకటరమణ నాయక్, కార్యదర్శి శ్రీనివాసులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 నేషనల్ రెజ్లింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నవంబరు 1 నుంచి హరియాణాలోని పానిపట్‌లో జరిగే ఎస్‌జీఎఫ్-19 జాతీయ రెజ్లింగ్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన బాలురలో శాంతు, రాజేష్, శ్రీనాథ్, నందీష్, గణేష్ ఉన్నారు. బాలికల్లో రాణి, స్పందన, అరుణ ఎంపికయ్యారు. ఎంపికైన రెజ్లింగ్ క్రీడాకారులను డీవీఈఓ వెంకట రమణనాయక్ అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, శాప్ కోచ్ రాఘవేంద్ర, మహాలక్ష్మి, సాయి పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు


పోస్టర్లు విడుదల చేస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): 42వ ఏపీ జూనియర్ రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 25, 26 తేదీల్లో అనంతపురంలో నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ శాంతరాజ్ తెలిపారు. కర్నూలులోని రాయలసీమ రీజియన్ డీఐజీ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల పోస్టర్లను గురువారం విడుదల చేశారు. రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13 ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరవుతారని కన్వీనర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు రామాంజి, తులసి వెంకటేష్, రాజేష్, రామ్మోహన్‌రెడ్డి, బిలాల్ పాల్గొన్నారు.

రెండు రోజులు మంత్రి పర్యటన

ధర్మవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ శనివారం నుంచి రెండు రోజుల పాటు ధర్మవరంలో పర్యటించనున్నట్టు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం అనంతపురంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని, మధ్యాహ్నం బత్తలపల్లి మండలంలోని చెర్లోపల్లిలో నూతనంగా నిర్మించనున్న సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తారన్నారు. అదేరోజు మధ్యాహ్నం 2-15గంటలకు పట్టణంలోని నాగులబావి వీధి, తేరు బజారులో గంగమ్మ జాతరలో పాల్గొంటారన్నారు. 3-30కు కత్తెకొట్టాల, పోతులనాగేపల్లిల్లో నూతనంగా నిర్మించనున్న సీసీరోడ్లకు శంకుస్థాపన చేస్తారన్నారు. సాయంత్రం 5గంటలకు ఎన్డీఏ కార్యాలయంలో సంస్కృతి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోకాళ్ల శస్త్రచికిత్స కోసం నియోజకవర్గనికి చెందిన 25 మందిని బెంగళూరుకు పంపే కార్యక్రమంలో పాల్గొని, పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తారన్నారు. అలాగే 26న ఆదివారం ఉదయం 10గంటలకు అనంతపురంలో జరిగే ఓ ప్రారంభోత్సవ కార్యక్రమంతో మంత్రి పర్యటన ముగుస్తుందన్నారు.

కాటకోటేశ్వరుడి హుండీ సొమ్ము లెక్కింపు

● రూ.9.07లక్షల ఆదాయం

తాడిమర్రి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లవారిపల్లి సమీపంలో వెలసిన కాటకోటేశ్వరస్వామి హుండీని గురువారం లెక్కించారు. గ్రామ పెద్దలు, ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టగా సీఐ శ్యామరావు, ఎస్ఐ క్రిష్ణవేణి భద్రతా ఏర్పాట్లుచేశారు. గడచిన 18నెలల కాలంలో స్వామివారి హుండీ ఆదాయం కింద రూ.9,07,663 వచ్చినట్టు ఈఓ తెలిపారు. ఆ మొత్తాన్ని గూగూడులోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో జమచేస్తామన్నారు. లెక్కింపు కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కూచి రాము, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, నాయకులు హర్ష, రాజశేఖర్, సాయి, శ్రీనివాసరెడ్డి, రమణ పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల సంఘం

మండల అధ్యక్షుడిగా హరికుమార్

ధర్మవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రాహ్మణ వీధికి చెందిన బైసాని హరికుమార్ అఖిల భారత అయ్యప్ప భక్తుల సంఘం మండల అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్టు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు న్యాయవాదివాంఢ్రాసి పెంచలయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా హరికుమార్ మాట్లాడుతూ... అయ్యప్ప భక్తుల సమస్యల పరిష్కారానికి, సంఘం బలోపేతానికి కృషిచేస్తానన్నారు. తన ఎంపికకు సహకరించిన ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు పెంచలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడపకండి: సీఐ

బత్తలపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీఐ ప్రభాకర్ తెలిపారు. బత్తలపల్లి సమీపంలోని టోల్ ప్లాజా వద్ద గురువారం సీఐ వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం తాగి, రికార్డులు లేకుండా... వాహనాలు నడిపే వారికి అవగాహన కల్పించి జరిమానా వేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... కుటుంబ సభ్యులను గుర్తు చేసుకొని వాహనాలు నడపాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పిల్లలను సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచండి

అమడగూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సమాజంలో సెల్‌ఫోన్ వాడకం అనేక వ్యసనాలకు దారితీస్తోందని ఎస్ఐ సుమతి అన్నారు. కావున పిల్లలను సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలని సూచించారు. మండలపరిధిలోని మహమ్మదా బాద్ ఆంజనేయస్వామి గుడి వద్ద ఎస్ఐ గురువారం స్థానికులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు ఇచ్చారు. గ్రామంలో ఎవరైనా అనుమానితులుగా తిరుగుతున్నా, అసాంఘిక కార్యకలా పాలు జరుగుతున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నా రు. కార్యక్రమంలో సిబ్బంది ఎస్‌హెచ్‌ఓ రామకృష్ణగౌడ, భాస్కర్, రమేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో

వసతుల గురించి పట్టించుకోరా?

● సమావేశంలో అధికారులను నిలదీసిన ఎంపీటీసీ

తనకల్లు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల ఆగడాలు ఇంకెన్నాళ్లు కొనసాగిస్తారంటూ మండలపరిధిలోని బాలసముద్రం ఎంపీటీసీ అమర్‌కార్తికేయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిలో వసతులు లేకపోవడాన్ని గమనించరా అని ప్రశ్నించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ వైవీ కౌసల్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలసముద్రం ఎంపీటీసీ మాట్లాడుతూ... మండలంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో పదవ తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. అయితే ఒక్క పాఠశాలలోనూ మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు లేవన్నారు. మరు గుదొడ్లు కూడా నిర్మించుకోలేని పాఠశాలలకు ఎలా అనుమతిస్తారని ఆగ్రహించారు. ఈ విషయంపై విచారణ చేపడుతామని అధికారులు హామీ ఇచ్చారు. అలాగే మండలంలోని ఏ ఒక్క మంచినీటి ట్యాంక్‌నూ ఏళ్ల తరబడి శుభ్రం చేయలేదని, వెంటనే శుభ్రం చేయించాలని పలువురు ప్రజా ప్రతినిధులు నిలదీశారు. మండలంలోని ఆరోగ్య ఉపకేంద్రాలు వర్షం వస్తే కారుతున్నాయని, మరమ్మతులు చేయించాలని హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ రెడ్డి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధిహామీ పథకం కింద గ్రామ పంచాయతీలకు సంబంధించిన భూములలో మొక్కల పెంపకం చేపట్టాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామానాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ




గుంతలు పడి అధ్వానంగా ఉన్న కత్తేకొట్టాలకు వెళ్లే మట్టి రోడ్డు, కనంపల్లికి వెళ్లే రహదారి

● 30 ఏళ్లనాటి అధ్వాన రహదారులకు మోక్షం
● మంత్రి సత్యకుమార్, పరిటాల శ్రీరామ్ చొరవతో రూ.6.10కోట్లు నిధులు మంజూరు
● హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణ ప్రజలు

ధర్మవరం రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రహదారులు సరిగా లేకపోవడంతో మండలపరిధిలోని పలు గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా ఎవరూ పట్టించుకున్న పాపనపోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ హయాంలోనూ ఎవరూ పట్టించుకో లేదు. అయితే కూటమి ప్రభు త్వం రాగానే గ్రామీణ రహదారులకు మోక్షం లభించింది. ఆ మేరకు ప్రభుత్వం ధర్మవరం మండలం లోని పలు గ్రామాలకు నూతన రహదారుల కోసం నిధులు మంజూరు చేసింది. దీంతో అధ్వాన రహదారులకు మోక్షం లభించిందని ఆయా గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ. 6.10కోట్లు మంజూరు

ధర్మవరం మండలంలో పలు గ్రామాలకు వెళ్లేందుకు రహదారులు సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఇబ్బందులపై ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమయ్యాయి. అదేవిధంగా గ్రామాలకు నూతన తారు రోడ్ల నిర్మాణంపై టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్‌చౌదరి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రహదారి లేకపోవడంతో ఇబ్బందికరంగా ఉన్న గ్రామాలకు నూతన రహదారుల నిమిత్తం అధికారులు, గ్రామస్థులతో చర్చించి ఎస్టిమేట్లు వేయించారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి మంత్రి సత్యకుమార్‌యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. వారు ప్రభుత్వానికి నివేదికలు అందించారు. ప్రభుత్వం స్పందించి ఉపాధిహామీ పథకం కింద రూ.6.10 కోట్లు నిధు లు విడుదల చేసింది. ధర్మవరం మండలంలోని ధర్మవరం రోడ్డు క్రాస్ నుంచి చింతలపల్లి వరకు, వసంతపురం తిక్కయ్యస్వామి గుడి నుంచి చిగిచెర్ల క్రాస్ రోడ్డు వరకు, మోటుమర్ల నుంచి కత్తేకొట్టాల మీదుగా గొల్లవాండ్లపల్లి రోడ్డు వరకు, పోతులనాగేపల్లి నుంచి కనంపల్లి వ రకు నూతన బీటీ రహదారుల కోసం ఈ నిధులను విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

ఏళ్ల కల నెరవేరింది



సరైన రోడ్డు లేకపోవడంతో మా గ్రామానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మోటుమర్ల నుంచి మా గ్రామం వరకు మట్టిరోడ్డంతా గుంతలు పడింది. వర్షం వస్తే గుంతల వద్ద బైకులు జారిపడి గాయాలపాలవుతన్నాం. గ్రామానికి రహదారి వేయాలని గతంలో ఎంతో మందిని అడిగినా పట్టించుకోలేదు. ఇప్పుడు మా గ్రామానికి నూతన రోడ్డు మంజూరైందని తెలిసింది. ఎంతోసంతోషం అనిపించింది. రహదారి సమస్యపై ఎన్నో ఏళ్ల కల నెరవేరతుండ టంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వానికి ధన్యవాదాలు.

- కత్తేపెద్దన్న, కత్తేకొట్టాల గ్రామం, ధర్మవరం మండలం

చాలా సంతోషంగా ఉంది



మా గ్రామం నుంచి ధర్మవరం రోడ్డులోకి వెళ్లాలంటే సుమారు 3కిలోమీటర్ల వరకు మట్టిరోడ్డు ఉంది. మధ్యలో చిత్రావతి నది. మట్టిరోడ్డంతా రాళ్లు తేలి ప్రయాణించాలంటే చాలా ఇబ్బంది పడుతున్నాం. మా గ్రామానికి నూతన రహదారికి నిధులు మంజూరయ్యాయని తెలిసినప్పటి నుంచి గ్రామస్థులు ఎంతో సంబరపడుతున్నారు. నూతన రహదారిని మంజూరుచేయించిన మంత్రి సత్యకుమార్, పరిటాలశ్రీరామ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

-విజయరాజు, కనంపల్లి, ధర్మవరం మండలం

త్వరలోనే భూమిపూజ

ధర్మవరం మండలంలోని పలు గ్రామాలకు నూతన తారురోడ్ల కోసం నిధులు మంజూరయ్యాయి. రోడ్ల నిర్మాణానికి త్వరలోనే భూమి పూజ చేసి, పనులు ప్రారంభిస్తాం. రహదారులను త్వరగానే పూర్తి చేయిస్తాం.

-పాండురంగారెడ్డి, డీఈఈ, ధర్మవరం

సకాలంలో ఏర్పాట్లు పూర్తి చేయండి

● కౌన్సిల్ సమావేశంలో సభ్యుల సూచన



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

పుట్టపర్తి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శతజయంతి ఉత్సవాల ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని కౌన్సిల్ సభ్యులు అధికారులకు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం చైర్మన్ తుంగ ఓబుళపతి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఫ్లోర్ లీడర్ రత్నప్పచౌదరి, కౌన్సిలర్లు జయప్ప, సూర్యగౌడ్, చెరువు భాస్కర్, సాయిగీతతోపాటు పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ... నవంబరులో జరిగే సత్యసాయి జయంతి వేడుకలకు లక్షలాది మంది భక్తులు రానున్నారన్నారు. మున్సిపాలిటీ పరిధిలో సీసీ రోడ్లు, వీధిలైట్లు, పారిశుద్ధ్యం, భూగర్భ డ్రైనేజీ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. తాగునీటి కొరత లేకుండా చూడాలన్నారు. అలాగే భక్తులకు ప్రభుత్వపరంగా చేయాల్సిన ఏర్పాట్లలో ఎలాంటి లోటు లేకుండా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందుకోసం ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్ మాట్లాడుతూ.. ఇప్పటికే సీసీ రోడ్లు, లైట్లు ఏర్పాటు చేస్తున్నా మన్నారు. పారిశుద్ధ్యం పనులు సాగుతున్నాయని పేర్కొన్నారు. భక్తుల కోసం తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లతోపాటు అపరిశుభ్రత లేకుండా చూస్తామన్నారు. సమావేశంలో ఏఈ స్వాతి, ఆర్ఐ నరసింహులు, సెంట్రింగ్ ఇన్‌స్పెక్టర్ శివయ్య పాల్గొన్నారు.

సోలార్‌పై రైతులకు వివరించాలని వినతి

నంబులపూలకుంట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సోలార్‌కు భూములు ఇస్తే కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని మండలంలోని వెలిచెలమల గ్రామస్థులు గురువారం ఆర్డీఓ వీవీఎస్ శర్మకు వినతి పత్రం అందజేశారు. ఇటీవల వెలిచెలమల, వంకమద్ది, పడమర నడిమిపల్లిల్లో రైతుల అనుమతితోనే సోలార్‌కు భూములు సేకరిస్తున్నామని అధికారులు తెలుపుతున్నారు. సోలార్‌కు భూములు ఇచ్చినట్లైతే ఎకరాకు రూ. 30వేలు లీజ్‌తో పాటు మూడేళ్ల తరువాత ప్రతి రెండేళ్లకు ఒకమారు లీజ్ 5 శాతం పెంచి ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. దినిపై రైతులకు అర్థమయ్యేలా వివరించాలని గ్రామస్థులు కోరారు. తహసీల్దార్ దేవేంద్రనాయక్, గ్రామస్థులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన

గాండ్లపెంట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఇండస్ట్రియల్, రిటైల్ విభాగం, మార్కెటింగ్ విధివిధానాలు, కస్టమర్ సర్వీస్, జీఎస్టీ, బిల్లింగ్ సిస్టమ్, విద్యుత్ పరికరాలు, పరిశ్రమల పని తీరుపై అవగాహన కల్పించారు. కదిరిలోని పలు షోరూమ్‌లను సందర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, ఉపాధ్యాయులు రజిత కుమారి, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఏ సభ్యత్వ నమోదు ప్రారంభం

తనకల్లు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మార్సీ భవనంలో గురువారం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఈఓ లలితమ్మ సభ్యత్వాన్ని పొందారు. మండలంలోని తనకల్లు, నల్లగుట్లపల్లి, బొంతలపల్లి, చీకటిమానిపల్లి, మార్పురువాండ్లపల్లి, ముత్యాలవారిపల్లిల్లోని పాఠశాలల ఉపాధ్యాయుల చేత సభ్యత్వ నమోదు చేయించినట్లు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌టీఏ రాష్ట్రప్రధాన కార్యదర్శి శివశంకర్ తెలిపారు. డీఏ ప్రకటనపై రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సకాలంలో పీఆర్సీ, డీఏ అరియర్స్, సరెండర్ లీవ్‌లు మంజూరు చేయాలని కోరారు.

ముళ్ల పొదలతో ఇబ్బందులు

నల్లమాడ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే డబుల్ రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, గడ్డి పొదలను ఏపుగా పెరిగాయి. దీంతో వాహనదారులు చాల ఇబ్బందులు పడుతున్నారు. నల్లమాడ నుంచి నుంచి దొన్నకోట గ్రామం మీదుగా పులగంపల్లి వరకు, నల్లమాడ నుంచి రాగానిపల్లి, గోపేపల్లి మీదుగా కొండె పాళెం వరకు ఈ పరిస్థితి కనిపిస్తోంది. నల్లమాడ నుంచి కొం డకమర్ల, నల్లమాడ నుంచి మలకవేముల వరకు ఉన్న డబుల్ రోడ్లులో పరిస్థితి అలాగా ఉంది. దీంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు ఆ రోడ్లపై వె ళ్లాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంది. అంతేగాకుండా గడ్డి ఏపుగా పె రగడంతో అందులో నుంచి సర్పాలు బయటకు వచ్చి రోడ్డుకు అడ్డంగా తిరుగుతున్నాయి. దీంతో వాహనచోదకులు వాహనాలు నడిపే సమయం లో భయపడి ప్రమాదాల బారిన పడిన సంఘటనలు ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆ రోడ్లకు ఇరువైపులా ఉన్న గడ్డి పొదలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



దొన్నికోట రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు, ముళ్లకంపులు, గడ్డి

మున్సిపాలిటీలోకి మా గ్రామాల విలీనం వద్దు

● ప్రజలు, టీడీపీ నాయకుల డిమాండ్



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు, గ్రామాల ప్రజలు

ధర్మవరం రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామాలను మున్సిపాలిటీలోకి విలీనం చేస్తే మున్సిపాలిటీ విధించే పన్నులు చెల్లించలేమని పలు గ్రామాల ప్రజలు, టీడీపీ నాయకులు పేర్కొన్నారు. తామంతా వ్యవసాయం, ఉపాధిహామీ పథకం ద్వారా జీవనం సాగిస్తున్నామని, మున్సిపాలిటీలోకి తమ గ్రా మాల విలీనం ప్రక్రియను ఆపాలని వారు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పోతులనాగేపల్లి, తుంపర్తి కాలనీ, కుణుతూరుకాలనీ, రేగాటిపల్లి, పోతుకుంట కాలనీ లను ధర్మవరం మున్సిపాలిటీలోకి విలీనం చేసేందుకు ఆమోదం తెలిపే సన్నహాలు జరుగుతున్నాయి. దీంతో విలీనం ప్రక్రియను ఆపాలని ఆయా గ్రామాల ప్రజలు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్‌చౌదరి ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణ, టౌన్‌ప్లానింగ్ అధికారి అలివేలమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కుట్రపూరితంగా తమ గ్రామాలను మున్సిపాలటీలోకి విలీనం చేసే ప్రక్రియ తగదన్నారు. గ్రామాలలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఉన్నఫలంగా మున్సిపాలిటీలోకి విలీనం చేయాలన్న నిర్ణయాన్ని వెంట నే ఉపసంహరించుకో వాలని నినాదాలు చేశారు. తాము మున్సిపాలిటీలో విధించే పన్నులు కట్టలేమన్నారు. విలీ నం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే భారీఎత్తున నిర సన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి విజయసారథి, తలారి వెంకటలక్ష్మి, పోతుకుంట రవి, కొండారెడ్డి, రమేష్, పోతుల నాగేపల్లి ఆదెప్ప, కత్తేకొట్టాల ప్రసాద్, భాస్కర్‌చౌదరి, అమర సుధాకర్, పోతుకుంట నారాయణస్వామి, డీలర్ గవ్వల రామాంజినేయులు, ఐటీడీపీ రాము పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను

టెట్ నుంచి మినహాయించండి

● ఎస్టీయూ నాయకులు

కదిరి అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహా యించా లని ఎస్టీయూ నాయకులు పేర్కొన్నారు. వారు గురువారం పట్టణంలోని పలు పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెట్ రాయకుండా ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులకు సుప్రీంకోర్టు టెట్ పరీక్ష తప్పనిసరి చేసిన నేపథ్యంలో ప్రభుత్వం రివ్యూపిటిషన్ వేసి వారికి మినహాయింపు ఇచ్చేలా చర్యలు చేప ట్టాలన్నారు. 2010కి ముందు ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులు సర్వీసులో కొనసాగాలన్నా, పదోన్నతులు పొందాలన్న రెండేళ్లలోపు టెట్ ఉత్తీర్ణత సాధించాలన్న నిబంధనతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఉపాధ్యాయ నియామకాలప్పుడు లేని నిబంధన ఇప్పుడు పెట్టడం ఏమిటని వారు ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు హరిప్రసాద్ రెడ్డి, జవహర్, లక్ష్మీప్రసాద్, ఎస్వీఎన్ ప్రసాద్, రవినాయక్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేస్తాం

● పట్టాలిచ్చి, ఇళ్లు నిర్మిస్తాం: ఎమ్మెల్యే కందికుంట



భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కదిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హామీ ఇచ్చారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాల యానికి ఎదురుగా ఉన్న భవన నిర్మాణ కార్మికుల కాలనీని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులలో అర్హులైన వారంద రికీ న్యాయం చేస్తామని తెలిపారు. ఎవరికైనా ఇళ్లకు సంబంధించి దొంగ పట్టాలు ఉంటే వారిపైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్మికులందరూ నిరుపేదలని పట్టాల కోసం నెలల తరబడి వారిని తిప్పడ సరికాదని అధికారులకు సూచించారు. అర్హులైన వారందరికీ వెంటనే పట్టాలివ్వాలన్నారు. భవన నిర్మాణ కార్మికులలో ఎవరు అర్హులు అనే నివేదికను వారం రోజుల లోగా తయారుచేయాలని ఆర్డీఓను ఆదేశించారు. అర్హులైన వారందరికీ పట్టాలిచ్చి, ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆటోనగర్ ఏర్పాటు చేయాలని వివిధ రకాల కార్మికులు ఎమ్మెల్యేకి విన్నవించారు. వెంటనే స్థలం పరిశీలించి, ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ వీవీఎస్ శర్మ, డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధర్మవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9-30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్‌శాఖ ఏఈ జానకిరామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డు వైడెనింగ్ పనులు చేపట్టడంతో శారదానగర్, చంద్రబాబునగర్, శాంతినగర్ ప్రాంతాలకు విద్యుత్‌సరఫరా నిలిపివే స్తున్నామని తెలిపారు. కావున ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు ఓడీసీ విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి గోల్ షూట్ బాల్ పోటీలకు మండలంలోని జీవనజ్యోతి పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల హెడ్‌మాస్టర్ దాలియా, కరస్పాండెంట్ అనితా తెలిపారు. ఈనెల 11, 12 తేదీల్లో చిత్తూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో తొమ్మిదో తరగతి చదువుతున్న మేఘన, ఎనిమిదో తరగతి చదువుతున్న హారిక, వైష్ణవీ నాయుడు, వర్షిణీ నాయుడు ఎంపికయ్యారన్నారు. ఈనెల 29న బిహార్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. ఆ విద్యార్థినులను కోచ్‌లు రమేష్, రమేష్‌నాయక్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులతో పాఠశాల హెచ్‌ఎం సుజాత

ధర్మవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): టేబుల్ టెన్నీస్ రాష్ట్ర స్థాయి పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు జీవన్ జ్యోతి పాఠశాల హెడ్‌మిస్ట్రెస్ సిస్టర్ సుజాత తెలి పారు. అనంతపురంలోని అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 7వ తేదీన నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీల్లో వారు ప్రతిభ కనబరచినట్టు తెలిపారు. అండర్-17 విభాగంలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఐశ్వర్య, అతికా, అండర్-19 విభాగంలో అక్షిత, జూహాత బుసమ్ ఎంపికయ్యారని ఆమె తెలిపారు. వారు విశాఖపట్నంలో శనివారం నుంచి ఈనెల 27 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల లో పాల్గొంటారన్నారు. ఆ విద్యార్థినులను గురువారం పాఠశాలలో ఆమెతో పాటు ఉపాధ్యాయులు, తోటి విద్యార్థినులు అభినందించారు.

రెజ్లింగ్‌లో పీసీఎంఆర్ విద్యార్థికి కాంస్యం



కాంస్యం సాధించిన హర్షవర్ధన్

ధర్మవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగలూరు వద్ద ఉన్న రూపారాజ పీసీఎంఆర్ పాఠశాల విద్యార్థి అరుణ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర స్థాయి కుస్తీపోటీల్లో ప్రతిభ కనబరచి కాంస్యపతకం సాధించినట్టు పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు. విజయవాడలో బుధవారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి కుస్తీ(రెజ్లింగ్) పోటీల్లో సత్తాచాటినట్టు ఆయన తెలిపారు. ఆ విద్యార్థిని పాఠశాల చైర్మన్‌తో పాటు డైరెక్టర్ రూపారాజా కృష్ణ, జగదీశ్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేశ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్‌జీఎఫ్ మండల స్థాయి విజేతలు



మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

కదిరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడలను గురువారం నిర్వహించారు. ఈ క్రీడలలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వాలీబాల్‌లో విజేతలుగా పట్నం పాఠశాల విద్యార్థులు, రన్నర్స్‌గా బ్లూమూన్ పాఠశాల విద్యార్థులు, కబడ్డీలో విన్నర్స్‌గా బ్లూమూన్, రన్నర్స్‌గా కుమ్మరవాండ్లపల్లి జడ్పీహెచ్‌ఎస్, ఖోఖోలో విజేతలుగా బ్లూమూన్, రన్నర్స్‌గా పట్నం ఉన్నత పాఠశాల విద్యార్థులు, బాడ్మింటన్‌లో విజేతలుగా చైతన్య పాఠశాల విద్యార్థులు, రన్నర్స్‌గా హరీష్ పాఠశాల విద్యార్థులు గెలుపొందారు. అదే విధంగా అండర్-17 బాడ్మింటన్ క్రీడలో విన్నర్స్‌గా హరీష్ పాఠశాల విద్యార్థులు, రన్నర్స్‌గా పట్నం పాఠశాల విద్యార్థులు నిలిచారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటాచలం, ఎంఈఓ చెన్నకృష్ణ, పీడీలు శంకర్‌నాయక్, యశోద, సుజాత, సంధ్యతో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్లలోనే టపాసుల గుట్టలు..!

- మిగులు సరుకును నిల్వ చేసుకున్న దుకాణదారులు!
- తనిఖీలు పట్టని అధికారులు
- పొంచివున్న ప్రమాదాలు

హిందూపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ మూడ్రోజులపాటు ఘనంగా నిర్వహించారు. బాణసంచా మోతతో చెవులు మోతెక్కాయి. గతంతో పోల్చితే ఈసారి అనుకున్న స్థాయిలో టపాసుల విక్రయాలు జరగలేదని వ్యాపారులు అంటున్నారు. పండగ సందర్భంగా ఏర్పాటు చేసుకున్న టపాసుల దుకాణాల్లో కొన్నింటిలో 30 నుంచి 50శాతం వరకు సరుకు మిగిలింది. తాత్కాలిక దుకాణదారులు ఎంత సరుకు తీసుకొస్తున్నారు, ఎంత మిగులుతుంది, ఎక్కడ నిల్వ చేసుకున్నారనే అంశాలను అధికారులు పట్టించుకోవట్లేదు. ఈసారి కూడా దుకాణదారులు టపాసులు ఇళ్లలో నిల్వ చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇళ్ల మధ్య టపాసులు నిల్వ ఉంటే ప్రమాదం జరిగితే బాధ్యులెవరన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దుకాణం ఏర్పాటు నుంచి పండుగ ముగిసినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పండుగ అయిపోయాక ఎంత సరుకు తెచ్చారు, ఎంత మిగిలింది, దీనిని ఎక్కడ నిల్వ చేస్తారన్న విషయాలను పట్టించుకునే వారే కరువయ్యారు. పోలీసులు, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల అధికారులు ఆ ఆలోచనే చేయకపోవడం దురదృష్టకరమని పట్టణవాసులు వాపోతున్నారు.

అమ్ముడుపోయింది 50 శాతమే..

జిల్లావ్యాప్తంగా 200వరకు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. హిందూపురంలో కూడా 40మంది తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కో షాపునకు రూ.5లక్షల నుంచి 20లక్షల వరకు సరుకు తెచ్చుకున్నట్లు తెలుస్తోంది. ఏ దుకాణదారుడు ఎంత సరుకు తెచ్చిందీ.. ఎవ్వరికీ తెలియదు. వాస్తవానికి దుకాణాలకు అనుమతి ఇచ్చిన తరువాతే సరుకు తీసుకురావాలి. హిందూపురంతోపాటు జిల్లాలో టపాసులు.. పండుగకు నెల ముందుగానే అక్రమంగా తెచ్చి, నిల్వ చేసుకున్నారు. జిల్లాకు వచ్చిన టపాసులు ఎంత అనేది వాణిజ్యశాఖ వద్ద లెక్కలు లేవు. దీంతో వ్యాపారులు ఆడిందే ఆటగా మారింది.

తనిఖీలు మరిచారు...

జిల్లాలో తాత్కాలిక టపాసుల దుకాణదారులు సుమారు రూ.25కోట్ల విలువచేసే టపాసులు తీసుకొచ్చినట్లు అంచనా. హిందూపురంలోనే ఈసారి రూ.6కోట్ల నుంచి రూ.8కోట్లదాకా సరుకు తెచ్చినట్లు తెలుస్తోంది.



మిగిలిన టపాసులు

మిగిలిన పట్టణాలు, మండల కేంద్రాల్లో విక్రయాలకు తీసుకొచ్చిన బాణసంచా విలువ మరో రూ.20 కోట్లు ఉంటుందని అంచనా. అమ్మకాలు కొన్నిచోట్ల 50 శాతం నుంచి 60 శాతం వరకు సాగాయి. 50 శాత సరుకు మిగిలినట్లు అంచనా. దానిని ఎక్కడ నిల్వ చేయాలన్న దానిపై నిబంధనలు ఉన్నాయి. జనసంచారం లేని ప్రాంతంలో గోదాముల్లో నిల్వ చేయాలి. అక్కడ కూడా నిబంధనలు పాటించాలి. వీటికి రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. గోదాముకు కలెక్టర్, ఆర్డీఓలు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అవన్నీ ఎందుకులే అనుకుని.. చాలామంది గోదాములకు దరఖాస్తు చేసుకోరు.

ఐదుగురికే గోదాములు

ప్రస్తుతం బర్త్‌డే, పెళ్లిళ్లు, రాజకీయ ర్యాలీలకు టపాసులు పేల్చడం ట్రెండ్‌గా మారింది. జిల్లాలో ప్రధాన పట్టణాల్లో ఏడాది పొడవునా టపాసులు అందుబాటులో ఉంటాయి. నిబంధనల ప్రకారం టపాసులు నిల్వ చేసుకోవాలంటే జనసంచారానికి దూరంగా గోదాములు ఉండాలి. అక్కడ రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖల అధికారుల సూచనల మేరకే నిల్వ చేయాలి. జిల్లావ్యాప్తంగా టపాసులు నిల్వ చేసుకోవడానికి ఐదుగురికి కూడా అనుమతిలేదని లెక్కలు చెబుతున్నాయి. హిందూపురంలో ముగ్గురికి మాత్రమే అనుమతి ఉంది. ఇక్కడ 40మంది దుకాణాలు పెట్టగా.. వీరందరికీ నిలువ చేసుకోవడానికి అనుమతి లేదు. అలాంటపుడు వీరంతా మిగిలిన సరుకు ఇళ్లలోనే పెట్టుకుంటున్నారని తెలుస్తోంది. దీపావళికి తాత్కాలిక దుకాణదారులు విక్రయించగా.. మిగిలిపోయిన సరుకును ఇళ్లమధ్యనే నిలువ చేసుకుని పెళ్లిళ్ల ఇతర ర్యాలీలకు విక్రయిస్తుంటారు. తాత్కాలిక షాపులు కేటాయించడానికి ఎన్నో నిబంధనలు విధించే అధికారులు.. మిగిలిన సరుకును ఎక్కడ నిల్వ ఉంచుతారోనని నిఘా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

న్యూస్ బాక్స్

ఘనంగా ఉర్దూ ఉత్సవాలు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

సోమందేపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గోరంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉర్దూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా ఉర్దూ అకాడమిక్ మానిటర్ ఆఫీసర్ అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. రూటాస్టేట్ అడిషనల్ జనరల్ సెక్రటరీ ఫిరోజ్‌అహ్మద్ మహ్మద్ ప్రవక్త జీవితం, ఆయన గొప్పతనంపై విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఎస్‌ఏ రైటింగ్, క్విజ్ పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. బహుమతుల దాత మహబూబ్‌బాషా, సీఎంసీ కమిటీ చైర్‌పర్సన్ ఆయిషా, హిదాయతుల్లా, ఆరిఫ్, యాకూబ్, సుగుణమ్మ, రుబీనా, రవీంద్ర, ప్రైమరీ హెచ్‌ఎం నజ్రుల్లా పాల్గొన్నారు.

ఎడ్లబండి బోల్తా.. వృద్ధుడి మృతి

పరిగి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సద్దెలకుంట మలుపు వద్ద ఎడ్లబండి బోల్తాపడిటన ఘటనలో నారాయణప్ప(69) అనే వృద్ధుడు మృతిచెందినట్లు జమేదార్ శ్రీనివాసులు తెలిపారు. గొరవనహళ్లి గ్రామానికి చెందిన నారాయణప్ప బుధవారం సాయంత్రం పొలం నుంచి ఇంటికి వస్తున్న సమయంలో సద్దెలకుంట మలుపువద్ద ఎడ్లబండి అదుపుతప్పి బోల్తాపడటంతో అపస్మారస్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గమనించి ద్విచక్రవాహనం సాయంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గురువారం కుమారుడు సోమశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పాఠశాలలో చోరీపై ఫిర్యాదు

మడకశిర రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్రేపల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన చోరీపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం మహేష్ తెలిపారు. మూడు రోజులు వరుసగా పాఠశాలలకు సెలవులు రావడంతో బుధవారం ఉదయం పాఠశాలకు విధులకు హాజరు కావడానికి వెళ్లగా అప్పటికే పాఠశాల తలుపులు, బీరువా తెరిచి ఉన్నాయని తెలిపారు. ఎస్‌ఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించినట్లు తెలిపారు. భద్రపరిచిన 30 భోజనం ప్లేట్లు, కోడిగుడ్లు, చిక్కీలు ఎత్తుకెళ్లారని తెలిపారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

పెనుకొండ టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 18 ఏళ్ల నిండిన యువతీ యువకులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పెనుకొండ నియోజకవర్గంలో 2,37,387 మంది ఓటర్లున్నారని ఇందులో పురుషులు 1,18,569, మహిళలు 1,18,815 మంది ఇతరులు నలుగురు ఉన్నారన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు చేసుకోవచ్చన్నారు. ఏఈఆర్ఓలు, బీజేపీ రామక్రిష్ణ పాల్గొన్నారు.

సురక్ష యాప్‌పై అవగాహన

రొళ్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వీరనాగమ్మ వైన్‌షాపులో గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సురక్ష యాప్‌పై ఎస్‌ఐలు శంకర్, వెంకటేశ్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. 21ఏళ్లలోపు ఎవరూ మద్యం సేవించరాదని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే అధిక ధరలకు మద్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఆర్థిక సాయం

సోమందేపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ 20రోజులుగా బెంగళూరులో చికిత్స పొందుతున్న విద్యార్థి గౌతమ్‌కు విజ్ఞాన్ పాఠశాల కరస్పాండెంట్ మల్లికార్జున రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. గురువారం విద్యార్థి తల్లిదండ్రులకు ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఎంఈఓ అంజనేయులునాయక్ చేతులమీదుగా నగదును అందజేశారు.

జిప్సం పంపిణీ

అమరాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక రైతు సేవా కేంద్రంలో గురువారం జిప్సం పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారి మంజునాథ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ క్లస్టర్ డెమాన్‌స్ట్రేషన్ కింద మూడు గ్రామాలకు మాత్రమే జిప్సం వచ్చిందని, అమరాపురం, హలుకూరు, గౌడనకుంటలో అవసరమున్న రైతులు తీసుకెళ్లవచ్చని తెలిపారు. మండల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

యాదవ మహాసభ కార్యదర్శిగా నర్సింహులు



రాష్ట్ర అధ్యక్షుడి నుంచి నియామక పత్రం అందుకుంటున్న నర్సింహులు యాదవ్

హిందూపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా తనను నియమించినట్లు గోరంట్ల మండలం ఎం.కొత్తపల్లికి చెందిన నర్సింహులుయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. 15ఏళ్లుగా యాదవ మహాసభకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు యాదవ కులస్థుల సమస్యలపై పని చేస్తున్నానన్నారు. దీనిని గుర్తించిన రాష్ట్ర అధ్యక్షుడు వెంగలరావు యాదవ్ నియామక పత్రాన్ని అందించినట్లు తెలిపారు.

స్మార్ట్‌కార్డులు పంపిణీ చేయండి

లేపాక్షి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్‌కార్డులను త్వరగా పంపిణీ చేయాలని తహసీల్దార్ సౌజన్యలక్ష్మి సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మొత్తం స్మార్ట్‌రేషన్‌కార్డులు 14,176 ఉన్నాయని వాటిలో 12,635 పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలినవి త్వరగా పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్డుదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులురాకుండా మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ కుమార్‌రెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేయండి

సోమందేపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలపై ప్రజలు, రైతులు నేరుగా తమ సమస్యలను అర్జీరూపంలో అందజేయాలని ఏఈ క్రిష్ణ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం గుమ్మయ్యగారిపల్లి సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10-30 నుంచి 1-30 గంటల వరకు ఉంటుందన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్నివర్గాలకు న్యాయం

పెనుకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో అన్నివర్గాల ప్రజలకు ఉపయోగకరమని ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి అన్నారు. గురువారం స్థానిక సత్యసాయిడిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జీఎస్‌టీ 2.0పై అవగాహన సదస్సు నిర్వహించారు. కామర్స్ అధ్యాపకులు హుమయూన్, శశిధర్‌రెడ్డి, నవీన్, బాబు పాల్గొన్నారు.

చేనేతలకు మార్జిన్‌మనీ విడుదల చేయాలి

సోమందేపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు మార్జిన్ మనీని విడుదల చేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకుడు నారాయణస్వామి గురువారం కెనరాబ్యాంక్ మేనేజర్ ప్రహ్లాదరావుకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులు 2023లో ముద్రలోన్ ద్వారా రూ.50వేలు తీసుకున్నారన్నారు. క్రమం తప్పకుండా కంతులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. అయినా ప్రభుత్వం ద్వారా రావాల్సిన రూ.10వేలు మార్జిన్‌మనీ వారి ఖాతాలకు జమకాలేదన్నారు. ఒక నెల కంతు కట్టకుంటే బ్యాంక్‌వారు ఇంటికి వచ్చి అడుగుతారన్నారు. మార్జిన్ మనీ విషయంలో నిర్లక్ష్యం వహించడం ఎంతవరకు సమంజసమన్నారు. నాయకులు దేవాంగం వెంకటేశులు, బెస్త కిష్టప్ప, కుమ్మర కిష్టప్ప, సంజీవ, శ్రీరాములు, ఖాసీం, ప్రభాకర్, నాగభూషణం, వెంకటేశులు, సోము పాల్గొన్నారు.

బీసీ సెల్ అధ్యక్షుడికి సన్మానం



రాజును సన్మానిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

హిందూపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ బీసీసెల్ పట్టణాధ్యక్షుడిగా ఎంపికైన ఎన్‌బీకే రాజును వాల్మీకి సంఘం నాయకులు సత్కరించారు. గురువారం వాల్మీకి మహర్షి ఆలయం వద్ద సత్కరించి అభినందించారు. సంఘం గౌరవాధ్యక్షుడు ఆదినారాయణ, అధ్యక్షుడు వెంకటరమణ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. వాల్మీకి సంఘం నాయకులు లోకేష్, ఆకుల సూర్యనారాయణ, టీకే బాబు, నాగరాజు, నరేష్ పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణలో విద్యార్థులే..!



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

హిందూపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయరాదని వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల కార్యక్రమం గురువారం హిందూపురంలో జరిగింది. కార్యక్రమానికి ఆ పార్టీ నాయకులు అంతంతమాత్రమేరాగా వైసీపీ నాయకులకు చెందిన కళాశాలల విద్యార్థులను పిలిపించి కార్యక్రమం చేపట్టారు. కళాశాల విద్యార్థులను రాజకీయాల కోసం పిలవడం విమర్శలకు తావిచ్చింది. హిందూపురంలో వైసీపీ నాయకులు చేపడుతున్న కార్యక్రమాలకు జనాదరణ లేకపోవడమేకాక సొంత పార్టీ నాయకులే డుమ్మా కొడుతున్నారు.

విగ్రహావిష్కరణను విజయవంతం చేద్దాం

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల



మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని బేగార్లపల్లి గ్రామంలో బాబూజగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం 27వ తేదీన నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పిలుపునిచ్చారు. గురువారం బాలాజీనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరవుతున్నారని, ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని సమన్వయంతో విజయవంతం చేద్దామన్నారు. విగ్రహ ఆవిష్కరణ చేసే ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. సభ ఏర్పాట్లపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, బేగార్లపల్లి రవి, కౌన్సిలర్లు ఉమాశంకర్, నాగేంద్ర, నాయకులు మాధవరాజ్, ఓబులేశు పాల్గొన్నారు.

గుడిబండ(ఆంధ్రజ్యోతి): మడకశిర మండలం బ్యాగార్లపల్లిలో 27న అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ కార్యదర్శి శ్రీనివాసమూర్తి పిలుపునిచ్చారు. గురువారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి 15మంది ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. సింగిల్‌విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, శ్రీనాథ్, మూర్తి, బాలేపల్లి రాజు, చిత్రశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయ బృందం

పరిగి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఇటీవల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో ధనాపురం జడ్పీ పాఠశాలకు చెందిన అక్షరరెడ్డి అనే విద్యార్థిని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం జ్యోతిర్మయి తెలిపారు. 27, 28వ తేదీల్లో పశ్చిమగోదావరిలో జరిగే వాలీబాల్ పోటీలకు ఎంపికైందన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు నాగరాజు, చైర్మన్ శివలింగప్ప, భాగ్యమ్మ పాల్గొన్నారు.



చరణ్ యాదవ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మడకశిర రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండుమల ఎంజేపీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి చరణ్ యాదవ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శివరామ్ తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపాల్,ఉపాధ్యాయలు అభినందించారు.



గెలుపొందిన విద్యార్థులతో పీడీ నారాయణస్వామి

అగళి (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి అండర్-14, 17బాలుర క్రీడల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థులు గెలుపొందినట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమారి, పీడీ నారాయణస్వామి తెలిపారు. 100, 200మీటర్ల పరుగు పందెంలో మొదటిస్థానం, షార్ట్‌పుట్‌లో మొదటిస్థానం సాధించారన్నారు. అదేవిధంగా కబడ్డీ, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్‌లో ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెనుకొండ రూరల్(ఆంధ్రజ్యోతి): అండర్-19 బాల బాలికల జట్టుకు గుట్టూరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు నాగార్జునుడు గురువారం తెలిపారు. గుట్టూరు జడ్పీపాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉమాలక్ష్మి జిల్లా జట్టుకు ఎంపికైంది. విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయిలో పాల్గొనున్నట్లు తెలిపారు. అండర్-14పల్లవి, మోనకర్ణిక, అండర్-17లో సంధ్య ఎంపికైనట్లు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం: ఎంఈఓ



విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి

గుడిబండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని ఎంఈఓ ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, చెస్, యోగా, పోటీలు నిర్వహించారు. అండర్-14, 17 బాలుర కబడ్డీ పోటీల్లో కేఏన్ పల్లి విన్నర్‌గా, గుడిబండ పాఠశాల రన్నర్‌గా, ఖోఖోలో గుడిబండ విన్నర్, మోరుబాగల్ రన్నర్‌గా నిలిచాయి. గెలుపొందిన క్రీడాకారులను హెచ్‌ఎం గోవిందప్ప అభినందించారు. పీడీలు ఓబులమ్మ, రమాదేవి, బాలునాయక్, లక్ష్మణ్‌నాయక్, హజారుద్దీన్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా రాణి చెన్నమ్మ జయంతి



చెన్నమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు

పావగడ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వీరవనితగా పేరుగాంచిన కిత్తూరు రాణి చెన్నమ్మ జయంతిని పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం అధికారులు, నాయకులు ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ రవి, వీరశైవ సంఘం అధ్యక్షుడు అంతరగంగ శంకరప్ప, సిబ్బంది చెన్నమ్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. ఆర్‌ఐ రాజగోపాల్, గ్రేడ్-2 తహసీల్దార్ ప్రసాద్, రెవెన్యూ అధికారులు చంద్రశేఖర్, నాయకులు రాజేంద్ర, కార్తీక్‌రాజు, జగదీష్‌హాజరయ్యారు.

కారుకూతలు కూయకు

- గత ఐదేళ్లలో అలాగే చేశావా?
- జగన్‌పై టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఫైర్

హిందూపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నోటికొచ్చినట్లు కారుకూతలు కూయవద్దని వైసీపీ అధినేత జగన్‌కు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప ఒక ప్రకటనలో హితవుపలికారు. గురువారం జగన్మోహన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. గత ఐదేళ్లలో జగన్‌చుట్టూ ఉన్నవారు అలాగే తాగి శాసనసభ సమావేశానికి వచ్చారా అని ప్రశ్నించారు. గౌరవప్రదమైన ఎన్టీఆర్ కుటుంబాన్ని ఇలా విమర్శించడం తగదన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణను విమర్శించేటపుడు ఆలోచించాలన్నారు. నోటికొచ్చినట్లు వాగితే ఊరుకోమన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు చేసిన అఘాయిత్యాలు, నోటిదురుసు కారణంగానే 11సీట్లు వచ్చాయని, అయినా బుద్ధి రాలేదన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

చిలమత్తూరు(ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణని ఉద్దేశించి మాజీ సీఎం జగన్మోహనరెడ్డి మాట్లాడిన మాటలు సరికాదని, ఖండిస్తున్నామని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్మోహనరెడ్డి ప్రెస్ మీట్ సందర్భంగా ఎమ్మెల్యే బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. శాసన సభకు మద్యం సేవించి వచ్చారని, ఆయన ఆరోగ్య స్థితి సరిగా లేదని వ్యాఖ్యానించడం దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో శాసనసభ ఏవిధంగా బూతు మాటలకు, అసభ్య పదాల వినియోగానికి వేదిక అయ్యిందో ప్రజలకు తెలుసన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే బాలకృష్ణ పనిచేస్తుంటే దానిని జీర్ణించుకోలేని ఆయన ఇలా మాట్లాడటం తగదన్నారు.

పిల్లలకు ప్రథమ గురువులు మాతృమూర్తులే

- ఆర్‌ఎస్‌ఎస్ సేవిక సంఘం సభ్యురాలు సుధాస్రవంతి

పెనుకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పిల్లలకు ప్రథమ గురువులు మాతృమూర్తులేనని హిందూపురం ఆర్‌ఎస్‌ఎస్ సేవిక సంఘం సభ్యురాలు సుధాస్రవంతి అన్నారు. గురువారం స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ సమావేశ భవనంలో సరస్వతి విద్యామందిరం ఆధ్వర్యంలో హెచ్‌ఎం పద్మజ అధ్యక్షతన ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లు పూర్తీచసుకున్న సందర్భంగా సప్తశక్తి సంఘం పేరుతో మాతృసంఘం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సుధాశ్రవంతి, నిమగరెడ్డి హాజరై ప్రసంగించారు. ప్రతి మహిళా శ్రీ, వాక్కు, కీర్తి, క్షమ, శృతి, మేధా, ధృతి అనే ఏడు గుణాలను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమానికి 300మంది మాతృమూర్తులు, 30మంది ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు హాజరయ్యారు. 35మంది మహిళలకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. మహిళలకు మంగళకర ద్రవ్యాలు అందించారు. పిల్లలు ప్రదర్శించిన నృత్య, పద్య, నాటికలు, పాటలు ఆకట్టుకున్నాయి.



మంగళకర ద్రవ్యాలు అందుకున్న మహిళలతో నిర్వాహకులు